http://www.agnidharanews.com

# అగ్నిధార

గురువారం 11 డిసెంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## మీరు నాకు చెప్పొద్దు.. నా అనుభవం 30 ఏళ్లు!

- రాహుల్‌పై అమిత్ షా తీవ్ర ఆగ్రహం
- లోక్‌సభలో అమిత్ షా, రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం
- మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదని రాహుల్‌కు స్పష్టం చేసిన షా
- ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు పోతాయనేదే విపక్షాల భయమని విమర్శ
- గతంలో కాంగ్రెస్ ప్రధానులూ ఇలాంటి సవరణలు చేశారని గుర్తు చేసిన షా



## ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు

**దేవుళ్ళ మీద ఒట్టేసి మరీ సీఎం రేవంత్ మోసం చేశాడు**

**రూ. 2 లక్షల రుణ మాఫీ కావాలంటే రూ. 50 వేల కోట్లు కావాల్సి ఉంటుంది**

**రూ. 12 వేల కోట్లతో కేవలం 25 శాతం మందికి మాత్రమే రుణ మాఫీ చేశారు.**



**సిరిసిల్ల**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని.. అందుకోసం అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? అని వారు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బుధవారం సిరిసిల్లలో కేటీఆర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఆత్మీయ భరోసా కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేవుళ్ళ మీద ఒట్టేసి మరీ సీఎం - మిగతా3లో



## రైలు టికెట్ ధరలు మనదగ్గరే తక్కువ

- "పొరుగు దేశాలతో పోలిస్తే మనదగ్గర రైలు టికెట్ ధరలు చాలా అందుబాటులో ఉన్నాయి
- అభివృద్ధి చెందిన దేశాల ధరల్లో ఇవి ఐదు నుంచి పది శాతం మాత్రమే
- గతేడాది దాదాపు రూ.60వేల కోట్లు రాయితీల కోసం అందించాం.
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

## స్టార్టప్‌లకు కేంద్రంగా హైదరాబాద్

- ఉత్తుత్తి మాటలు చెప్పను..
- చీడ పడితే ఏ మందు కొట్టాలో తెలుసు
- "ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చా
- ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి
- నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది
- సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు
- ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు



**హైదరాబాద్**

గుండెల నిండా అభిమానం నింపుకొని ఓయూకు వచ్చానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఓయూ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు ప్రకటించారు. "ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చా. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా - మిగతా3లో



## పూర్తి డేటాతో రండి'.. ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం

ఇండిగో వ్యవహారంపై దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పౌర విమానయాన శాఖ ఇప్పటికే వెల్లడి ఇటీవలి అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, అప్‌డేట్‌లు, పూర్తి నివేదికతో రావాలి"

## 890 గ్రామాల్లో ఏకగ్రీవం

**బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నాం**

**పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుంది**

**తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి**

**ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశాం**

**సీఎం రేవంత్‌పై ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన ఫిర్యాదును పరిశీలిస్తున్నాం: ఎస్ఈసీ రాణి కుమిదిని**



**హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో - మిగతా3లో



## భారతీయుల ఆహారంలో పెద్ద లోపం ఇదే!

- తాజా అధ్యయనంలో వెల్లడి
- భారతీయుల ప్రోటీన్‌లో దాదాపు సగం బియ్యం, గోధుమల నుంచే
- ఇది నాణ్యత లేని ప్రోటీన్ అని అధ్యయనంలో వెల్లడి
- కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల వాడకం చాలా తక్కువ
- నూనె, ఉప్పు, చక్కెర వినియోగం ప్రమాదకర స్థాయిలో పెరుగుదల
- పదేళ్లలో 40 శాతం తగ్గిన చిరుధాన్యాల వాడకం

## నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ



**హైదరాబాద్**

నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని చెప్పారు. ఈ సమ్మిట్‌పై భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. సమ్మిట్‌లో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. కంపెనీల ప్రొఫైల్ చూడకుండా ఒప్పందాలు జరగవన్నారు. ఫ్యూచర్ సిటీ.. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని చెప్పారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# మీరు నాకు చెప్పొద్దు.. నా అనుభవం 30 ఏళ్లు!

లోక్‌సభలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సంస్కరణలపై జరుగుతున్న చర్చలో రాహుల్ గాంధీ అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అమిత్ షా ఘాటుగా స్పందించారు. "మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదు... సభా సమావేశాలను మీరు శాసించలేరు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కల్పించుకుని, "ముందు నిన్న నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. దీనిపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. తనకు అసెంబ్లీ, పార్లమెంటులో 30 ఏళ్ల అనుభవం ఉందని, తాను ఎప్పుడు మాట్లాడాలో మీరు నిర్దేశించలేరని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు. విపక్షాలు 'ఓట్ల దొంగతనం' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారిని, విదేశీ పౌరులను తొలగించడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. "చట్టవిరుద్ధ వలసదారులు ఎన్నికల్లో పాల్గొనాలా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1952 నుంచి 2004 వరకు అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఓటర్ల జాబితా సవరణలు జరిగాయని గుర్తుచేశారు. "జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఎవరూ దీనిని వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు?" అని



నిలదీశారు. నాలుగు నెలలుగా ఏకపక్ష అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తమకు మద్దతిచ్చే చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు తొలగిపోతాయనే భయంతోనే విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని అమిత్ షా విమర్శించారు.

లోక్‌సభలో ఎస్ఐఆర్‌పై చర్చకు అమిత్ షా భయపడుతున్నారు. మొదటిసారి ఈసీకి పూర్తి ఇమ్యూనిటీ ఇచ్చారు. హర్యానాలో 19 లక్షల నకిలీ టోర్లు ఉన్నారు. ఓట్ల చోరీ వ్యవహారంలో నా ఆరోపణలకు జవాబివ్వగలారా? చర్చకు సిద్ధమా? అని రాహుల్ అన్నారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ..

నేను ఎప్పుడు మాట్లాడాలో.. ఎలా మాట్లాడాలో ఎవరూ నిర్ణయించలేరు. వాళ్లకు(రాహుల్‌ను ఉద్దేశించి..) కాస్త సహనం ఉండాలి. అన్ని ప్రశ్నలకు జవాబిస్తా. ధైర్యంగా ఉండాలి. రాహుల్ గాంధీ ఓట్ చోరీ పేరిట హైడ్రోజన్ బాంబు వేశారు. హర్యానాలో నకిలీ ఓటర్లు ఉన్నారని అంటున్నారు. కానీ, అక్కడ ఎలాంటి నకిలీ ఓటర్లు లేరు.

నెహ్రూ హయాంలోనే ఓట్ చోరీ జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మెజారిటీ వచ్చినా.. నెహ్రూనే ప్రధాని అయ్యారు. ప్రధాని విషయంలో నెహ్రూ ఓట్ చోరీకి పాల్పడ్డారు. అలహాబాద్‌లో ఇందిరా గాంధీ ఓట్ చోరీకి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సోనియా గాంధీ భారత పౌరురాలు కాకముందే ఓటేసి ఓట్ చోరీ చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు ఏనాడూ మేం ఈసీని తప్పుబట్టలేదు" అని అమిత్ షా అన్నారు.

ఈ క్రమంలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన సంస్థ. సీఈసీని ఎన్నుకునే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా ఉంటారు. ఓటర్ల సవరణ బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఎస్ఐఆర్ ప్రక్రియ తాము మొదలు పెట్టిందేం కాదని.. ఏనాటి నుంచో కొనసాగుతోందని.. అలాంటప్పుడు దీనిపై చర్చే అనవసరం అని అన్నారాయన. చివర్లో.. భారత్‌లోని విదేశీ ఓటర్లను ఏరిపారేయాల్సిన అవసరం ఉందని షా వ్యాఖ్యానించారు.

# ఇక రైల్వే వంతు!

విమానయాన రంగంలో ఇటీవల చోటుచేసుకున్న సంక్షోభం ఎంతటి గందరగోళానికి, నష్టానికి దారి తీసిందో తెలిసిందే. పైలట్ల విషయంలో రెస్ట్ రూల్స్ అమల్లోకి రావడం.. దాంతో కొరత తలెత్తి విమాన సర్వీసులు ఆగిపోవడం(కృత్రిమ కొరత సృష్టించారనే ఆరోపణలున్నాయ్).. చివరకు తాత్కాలికంగా ఆ రూల్స్‌ను కేంద్రం వెనక్కి తీసుకోవడం.. చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఇప్పుడు ఆ ఫోకస్ భారతీయ రైల్వే వైపు మళ్లే అవకాశం కనిపిస్తోంది.

దేశవ్యాప్తంగా రైళ్లను నడిపే లోకో పైలట్లు తమకూ విశ్రాంతి అవసరమనే గళం వినిపించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో కోట్లాది ప్రయాణికుల భద్రతను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. "రైల్వేలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. కానీ, మేం తీసుకునేది అతికొద్ది విశ్రాంతి. చేసేది 14 నుంచి 23 గంటలపాటు నిరంతరంగా పని. ఇలాంటి దీర్ఘకాలిక డ్యూటీలు అలసటను పెంచి, ఏకాగ్రతను తగ్గిస్తాయి. ఫలితంగా.. లక్షల మంది మంది ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఎఫ్ఆర్ఎంఎస్ ఆధారంగా డ్యూటీ అవర్స్ పరిమితులు అమలు చేయాలి" అని లోకోపైలట్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రైల్వేలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నా, రైళ్లను నడిపే పైలట్లపై ఒత్తిడి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో కఠిన డ్యూటీ అవర్స్‌పై పరిమితులు ఉన్నాయి. భారతదేశంలో మాత్రం రైల్వేలో అలాంటివేం లేకపోవడంతో వాళ్ల ఆందోళనను తీవ్ర తరం చేస్తోంది. ఒకవైపు భారతీయ రైల్వేస్ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండగా.. మరోవైపు లోకో పైలట్లకు సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల మానవ తప్పిదాలు జరిగే అవకాశం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**డిమాండ్లు:**

భద్రతాపరమైన నియమాలు.. లోకో పైలట్లకు అలసటను తగ్గించే విధానాలు, నియమాలు అమలు చేయాలి.

రోస్టర్.. షిఫ్ట్‌లను శాస్త్రీయంగా, సమయపూర్వకంగా కేటాయించాలి.

వారంతాపు విశ్రాంతి.. వారానికి కనీసం ఒక విశ్రాంతి రోజు తప్పనిసరిగా ఇవ్వాలి.



**పోలిక సబబేనా?..**

విమానయానం.. రైల్వే.. ఈ రెండు రంగాల్లో పైలట్లు, లోకో పైలట్ల అలసట, దీర్ఘకాలిక డ్యూటీలు, విశ్రాంతి లేకపోవడం వల్ల ప్రయాణికుల విషయంలో భద్రతా సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. మొదటి నుంచి పైలట్ల విశ్రాంతి నియమాలను పాటించకపోవడం వల్ల విమానయాన రంగంలో పెద్ద సంక్షోభం ఏర్పడింది. కానీ, ఇదే సమస్య రైల్వేలోనూ ఎన్నో ఏండ్ల నుంచి కొనసాగుతోందని ఏఐఎల్ఆర్ఎస్ఏ చెబుతోంది.

ప్రభుత్వ రంగ ఉద్యోగుల ఆందోళనలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటారు. అదే ప్రైవేట్ కార్పొరేషన్లు (ఇండిగో వంటి సంస్థలు) భద్రతా నియమాలను పాటించకపోతే.. ప్రభుత్వం వారికి తలొగ్గుతుంది అని కొందరు లోకో పైలట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దశాబ్దాలుగా..**

రోజుకు 6 గంటల డ్యూటీ పరిమితి. ప్రతి డ్యూటీ తర్వాత 16 గంటల విశ్రాంతి. వారానికి ఒక కంపల్సరీ రెస్ట్.. డిమాండ్‌లను 1970 నుంచే ఏఐఎల్ఆర్ఎస్ఏ వినిపిస్తోంది. 80-90 మధ్య కాలంలో నిరంతర ఆందోళనలు జరిగాయి. కాస్త గ్యాప్ తర్వాత.. 2000 సంవత్సరం నుంచి మళ్లీ ఉద్యమాలు జరిగాయి. 2024 అక్టోబర్‌లో దేశవ్యాప్త నిరసన నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వేలాది లోకో పైలట్లు సమావేశమై, రైల్వే బోర్డుకు మెమోరాండం సమర్పించారు. అయినా చలనం లేకపోవడంతో.. ఇప్పుడు ఇండిగో సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ కేంద్రంపై ఒత్తిడి పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

"లోకో పైలట్ల ఆందోళనలు ప్రజల భద్రతకు సంబంధించిన కీలక హెచ్చరికగా భావించాలి. రైల్వే మంత్రిత్వ శాఖ తక్షణమే కొత్త నియమాలు, విశ్రాంతి విధానాలు అమలు చేయకపోతే, రైళ్ల భద్రతకు పెద్ద ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. విమానయాన రంగంలో జరిగిన సంక్షోభం తర్వాత, రైల్వేలోనూ ప్రయాణికుల ప్రాణాలను కాపాడే చర్యలు అత్యవసరం" అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# విజయ్ ర్యాలీలో గర్జించిన లేడీ సింగం

కరూర్ విషాదం నేపథ్యంలో.. టీవీకే సభలు, ర్యాలీలకు షరతులు, పరిమితులతో నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో.. తాజాగా పుదుచ్చేరిలో జరిగిన విజయ్ ర్యాలీ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. పరిమిత సంఖ్యలో కార్యకర్తలు(అభిమానుల్ని) అనుమతించడంతో కొందరు బలవంతంగా లోనికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే లేడీ సింగం గర్జించింది.. మంగళవారం ఉదయం ఉప్పలం ఎక్స్‌పో గ్రౌండ్ వద్ద విజయ్ ర్యాలీ జరుగుతున్న సమయంలో టీవీకే నేత బస్సీ ఆనంద్.. బారికేడ్ల వద్దకు వచ్చి "లోపల స్థలం ఉంది.. రండి..' అంటూ జనాల్ని లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఐపీఎస్ అధికారిణి ఇషా సింగ్ వెంటనే ఆయన చేతిలో ఉన్న మైక్‌ను లాగిపడేశారు. 40 మంది ప్రాణాలు పోయాయి కదా.. మళ్లీ అలాంటి పరిస్థితులు కావాలనుకుంటున్నారా? అని ఆయన్ని ఆమె నిలదీశారు. ఈ క్రమంలో.. అనుమతించిన సంఖ్యకు మించి ఒక్కరినీ కూడా లోపలికి అనుమతించబోమని కుండబద్దలు కొట్టారామె. దీంతో.. ఆయన మౌనంగా చూస్తూ ఉండిపోయారు. కరూర్ ఘటన తర్వాత పుదుచ్చేరి పోలీసులు కఠిన నియమాలు అమలు చేశారు. రోడ్షోకు అనుమతి లేదు, ప్రజల సంఖ్యను 5,000కి పరిమితం చేశారు. %ు=% కోడ్ పాస్ ఉన్నవారికే ప్రవేశం ఇచ్చారు. అయితే అంత జాగ్రత్తలు పాటించినా కూడా ఓ వ్యక్తి



తుపాకీతో రావడం కలకలం రేపింది. ఇషాసింగ్(28) 2020లో యూపీఎస్సీ ఆల్ ఇండియా 191 ర్యాంకర్. 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఇషా సింగ్.. ప్రస్తుతం పుదుచ్చేరి పోలీస్ సూపరింటెండెంట్. ఆమె తండ్రి మాజీ ఐపీఎస్ వైపీ సింగ్(ముంబై పోలీస్? కమిషనర్‌గానూ పని చేశారు). తల్లి అభాసింగ్ లాయర్, సామాజిక కార్యకర్త. ఇషా సింగ్ నేషనల్ లా స్కూల్‌నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఐపీఎస్ కాకముందు.. లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు.

## రైలు టికెట్ ధరలు మనదగ్గరే తక్కువ

ఇంటర్నెట్ డెస్క్: అభివృద్ధి చెందిన దేశాలు, పొరుగుదేశాలతో పోలిస్తే భారత్‌లోనే రైలు టికెట్ ధరలు తక్కువగా ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. వీటి ధరలు తక్కువగా ఉంచేందుకు గతేడాది రూ.60వేల కోట్లు సబ్సిడీ అందించామన్నారు. వయోవృద్ధులకు రైలు టికెట్ రాయితీని పునరుద్ధరించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అని కాంగ్రెస్ ఎంపీ ఎంకే విష్ణు ప్రసాద్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి ఈ సమాధానమిచ్చారు. "పొరుగు దేశాలతో పోలిస్తే మనదగ్గర రైలు టికెట్ ధరలు చాలా అందుబాటులో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల ధరల్లో ఇవి ఐదు నుంచి పది శాతం మాత్రమే. గతేడాది దాదాపు రూ.60వేల కోట్లు రాయితీల కోసం అందించాం. తద్వారా ప్రయాణికుల టికెట్ ధరలు అందుబాటులో ఉన్నాయి" అని రైల్వే మంత్రి వివరణ ఇచ్చారు. కరోనా విజృంభణ సమయంలో రైళ్లలో సీనియర్ సిటిజన్ ప్రయాణ టిక్కెట్ల రుసుములో ఇచ్చే రాయితీలను కేంద్రం ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వాటిని పునరుద్ధరించలేదు.

## భారతీయుల ఆహారంలో పెద్ద లోపం ఇదే!



భారతీయుల ఆహారపు అలవాట్లపై ఓ అధ్యయనంలో ఆందోళన కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశ ప్రజలు తమకు అవసరమైన ప్రోటీన్‌లో దాదాపు సగం బియ్యం, గోధుమ, రవ్వ, మైదా వంటి ధాన్యాల నుంచే పొందుతున్నారని తాజా నివేదిక స్పష్టం చేసింది. అయితే, ఇది నాణ్యత లేని ప్రోటీన్ అని, సులభంగా జీర్ణం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలసీ రీసెర్చ్ సంస్థ 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' (సీఈఈడబ్ల్యూ) ఈ అధ్యయనాన్ని బుధవారం విడుదల చేసింది. దీని ప్రకారం, భారతీయులు సగటున రోజుకు 55.6 గ్రాముల ప్రోటీన్ తీసుకుంటున్నా, దాని నాణ్యతపైనే ప్రధాన ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఆహారంలో కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల వాడకం చాలా తక్కువగా ఉండగా, వంట నూనెలు, ఉప్పు, చక్కెర వినియోగం అధికంగా ఉన్నట్లు తేలింది. "భారత ఆహార వ్యవస్థలో ఇదొక నిశ్శబ్ద సంక్షోభం. తక్కువ నాణ్యత గల ప్రోటీన్‌పై ఆధారపడటం, ధాన్యాలు, నూనెల ద్వారా అధిక కేలరీలు తీసుకోవడం, పోషకాలున్న ఆహారాన్ని తక్కువగా తినడం వంటివి తీవ్ర అసమతుల్యతకు దారితీస్తున్నాయి" అని సీఈఈడబ్ల్యూ ఫెలో అపూర్వ ఖండేల్వాల్ తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య ఆహార వినియోగంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని ఆమె వివరించారు. 2023-24 ఎన్ఎస్ఎస్ఓ సర్వే డేటా ఆధారంగా ఈ విశ్లేషణ చేశారు. గత దశాబ్ద కాలంలో జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాల వినియోగం ఏకంగా 40% పడిపోయిందని నివేదిక పేర్కొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), పీఎం పోషణ్, అంగన్‌వాడీ వంటి ప్రభుత్వ పథకాలలో కేవలం బియ్యం, గోధుమలకే పరిమితం కాకుండా.. చిరుధాన్యాలు, పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటివి కూడా చేర్చాలని అధ్యయనం సిఫార్సు చేసింది.

## పూర్తి డేటాతో రండి'..
## ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం




**ఇంటర్నెట్ డెస్క్:** ఇండిగో విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయాలతో ఇటీవల లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సంస్థ సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తూ కేంద్రం ఇప్పటికే చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తమ ముందు హాజరుకావాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవలి పరిణామాలకు సంబంధించిన పూర్తి డేటాతో ఈ నెల 11న డీజీసీఏ కార్యాలయానికి రావాలని ఓ ప్రకటనలో తెలిపింది. "ఇండిగో సీఈవో, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డీజీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలి. ఇటీవలి అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, అప్‌డేట్‌లు, పూర్తి నివేదికతో రావాలి" అని డీజీసీఏ ఆదేశించింది. విమాన సర్వీసుల పునరుద్ధరణబీ పైలట్లు, సిబ్బంది నియామకాల ప్రణాళికబీ పైలట్లు, క్యాబిన్ సిబ్బంది సంఖ్య వివరాలుబీ రద్దయిన విమానాల సంఖ్యబీ రీఫండ్‌లు తదితర పూర్తి సమాచారాన్ని అందజేయాలని సూచించింది. ఇండిగో వ్యవహారంపై దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలి అంతరాయాలకు దారితీసిన కారణాలను గుర్తించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పౌర విమానయాన శాఖ ఇప్పటికే వెల్లడించింది. డీజీసీఏ ఇప్పటికే ఓసారి ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ తీసుకుంది. కచ్చితమైన కారణాలను గుర్తించేందుకు మరికొంత సమయం కావాలని విమానయాన సంస్థ కోరింది.

## పులి వేషంలో అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యే

**ముంబై:** ఒక ఎమ్మెల్యే పులి వేషంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. తన నియోజకవర్గంలో చిరుత పులుల దాడులు పెరుగడంపై ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. జనంపై చిరుతల దాడి గురించి గత పదేళ్లుగా తాను మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మహారాష్ట్రలో ఇటీవీల చిరుతల దాడులు ఎక్కువయ్యాయి. జున్నార్‌లో గత మూడు నెలల్లో చిరుతల దాడుల్లో 55 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. కాగా, ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే శరద్ సోనావానే వినూత్నంగా నిరసన తెలిపారు. పులి మాదిరి దుస్తులు ధరించి ఆ వేషంలో అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా శివసేనకు చెందిన జున్నార్ ఎమ్మెల్యే శరద్ మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అంతటా పెరుగుతున్న చిరుతపులి దాడులపై ప్రభుత్వం దృష్టిని ఆకర్షించడానికి పులి వేషధారణ డ్రెస్ వేసినట్లు తెలిపారు. మరోవైపు ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి దాదాపు దశాబ్ద కాలంగా తాను ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే శరద్ తెలిపారు. చిరుతపులి దాడులపై రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ప్రకటించాలని డిమాండ్ చేశారు. '2014 నుంచి నేను ఈ సమస్యను లేవనెత్తుతున్నా. కానీ ప్రభుత్వం నన్ను విస్మరిస్తూనే ఉంది' అని అన్నారు. చిరుతలను బంధించేందుకు రెస్క్యూ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

# 890 గ్రామాల్లో ఏకగ్రీవం

-మొదటిపేజీ తరువాయి

ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు. మొదటి దశ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లన్నీ జరిగినట్లు స్టేట్ ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని దేవి ప్రకటించారు. పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను ఆమె బుధవారం మీడియాకు వెల్లడించారు. రేపు మొదటి దశ సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్.. మధ్యాహ్నం 2గంటల నుంచి కౌటింగ్ ఉంటుంది. రేపు సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక లేదంటే ఎల్లుండి ఉంటుంది. ఇప్పటికే అబ్జర్వర్ల, మైక్రో అబ్జార్వుల నియామకం జరిగింది. ఓటర్ స్లిప్లు పంపిణి దాదాపు పూర్తి అయింది. సిబ్బందికి శిక్షణ ఇప్పటికే పూర్తి అయిందని వెల్లడించారామె.

సీఎం రేవంత్ రెడ్డిపై ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు పైనా ఆమె స్పందించారు. ఆ ఫిర్యాదును ఎన్నికల సంఘం ఎంసీసీ(%వీశీసవశ్రీ జశీసవ శీట జశీఅఎబఛ్%) కమిటీకి పంపాం. ఆ కమిటీ నివేదిక తర్వాత తదుపరి చర్యలు ఉంటాయి. రెండు సంవత్సరాల ప్రజా పాలన ఉత్సవాల కోసం అనుమతి అడిగారు. మేం అనుమతి ఇచ్చాం అని అన్నారామె.

**మొత్తం మండలాలు నోటిఫై: 189**



గ్రామ పంచాయతీలు నోటిఫై: 4236
వార్డులు నోటిఫై: 37,440
పోలింగ్ స్టేషన్లు: 37,562
ఫేజ్%-%1 ఓటర్ల సంఖ్య: 56,19,430
పురుషులు: 27,41,070
మహిళలు: 28,78,159
ఇతరులు: 201
**పోలింగ్‌కు వెళ్లే %+ూ%లు: 3,834**
పోలింగ్‌కు వెళ్లే వార్డులు: 27,628
సర్పంచ్ అభ్యర్థులు: 12,960
వార్డ్ మెంబర్ అభ్యర్థులు: 65,455
%=ా%లు నియామకం: 3,591

పోలింగ్ సిబ్బంది: 93,905
మైక్రో ఆబ్జర్వర్లు: 2,489 (మూడూ దశలకు)
వెబ్‌కాస్టింగ్ కోసం గుర్తించిన పోలింగ్ స్టేషన్లు: 3,461
బ్యాలెట్ బాక్సులు అందుబాటులో: 45,086

ఇక ఎన్నికల మోడల్ కోడ్ ఉల్లంఘన కేసులు.. సీజ్‌లు తదితర వివరాలను ఏడీజీ మహేష్ భగవత్ వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

**ఎన్నికల మోడల్ కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు: 3,214**

ప్రివెంటివ్ యాక్షన్‌లో బౌండ్ ఓవర్ వ్యక్తులు: 31,428
డిపాజిట్ చేసిన లైసెన్స్ ఆయుధాలు: 902
సీజ్ చేసిన నగదు: ?1,70,58,340
సీజ్ చేసిన మద్యం: ?2,84,97,631
డ్రగ్స్ / నార్కోటిక్స్: ?2,22,91,714
విలువైన లోహాలు / ఆభరణాలు: ?12,15,500
ఇతర వస్తువులు: ?64,15,350
మొత్తం సీజ్ విలువ: ?7,54,78,535

రేపు తెలంగాణ రాష్ట్రంలో మొదటి దశ గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంతో.. రాష్ట్ర వ్యాప్తంగా 243 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని.. అక్కడ డబుల్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఏడీజీ మహేష్ భగవత్ తెలిపారు.

# కలహాల కాపురం కాంగ్రెస్‌ను ఏం చేస్తుందో

**హైదరాబాద్ :** కాంగ్రెస్‌లో కలహాలు కామన్. ఓ నేత అంటే మరో లీడర్‌కు పడదు. ఇంకో నాయకుడి ఎదుగుదలను మరొక నేత డైజెస్ట్ చేసుకోలేరు. ఇక పవర్‌లోకి వచ్చాక ఈ గొడవ ఇంకా ఎక్కువైంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల వేళ.. ఇంటి పోరు హస్తం పార్టీకి హెడెక్‌గా మారిందట. మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నల్గొండ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఆధిపత్య పోరు..సర్పంచ్ ఎన్నికల్లో పోటీనే మార్చేసిందట. ఏ ఊరికి వెళ్లినా కనీసం ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ ఉండటంతో.. ఎక్కడ తమ పుట్టి మునుగుతుందేమోనని టెన్షన్ పడుతున్నారట హస్తం పార్టీ పెద్దలు.అధికార హస్తం పార్టీకి నల్గొండ జిల్లా కంచుకోట. 12 అసెంబ్లీ సీట్లు ఉంటే ఒక్క సూర్యాపేటలో మినహా మిగతా 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది కాంగ్రెస్ పార్టీ. జిల్లాలో కీలక పదవులన్నీ కాంగ్రెస్ నేతల చేతుల్లోనే ఉన్నాయి. చాలా ముఖ్యమైన పంచాయతీ ఎన్నికల్లోనే హస్తం పార్టీకి అసలు సమస్య వచ్చి పడిందట. ఇన్నాళ్లుగా లీడర్ల మధ్య నడిచిన కోల్డ్ వార్ కాస్త.. వర్గపోరుగా మారి..రచ్చకెక్కి ఇంటిపోరును రోడ్డున పడేస్తుందట. ఇప్పటికే పాత, కొత్తగా విడిపోయిన అధికార పార్టీ నేతలు పార్టీలో కుంపటి పెట్టారట. జరుగుతున్న పరిణామాలు తెలుస్తున్నా..నోరెత్తలేని పరిస్థితుల్లో ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని ఆ పార్టీ సీనియర్ లీడర్లే చెబుతున్నారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో ఇటువంటి ఇంటి పోరు ఎక్కువగా ఉందని అంటున్నారు హస్తం నేతలు.ఆధిపత్య పోరుతో పల్లె పోరు అధికార హస్తం పార్టీకి చెమటలు పట్టిస్తోందట. ఉమ్మడి జిల్లాలో దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే దాదాపు అన్నిచోట్ల పోటీ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగానే ఉంటోందట. హస్తం పార్టీ లీడర్లే వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారట. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఒరిజినల్ కాంగ్రెస్..వలస కాంగ్రెస్ లీడర్ల మధ్య గట్టి ఫైట్ నడుస్తోందట. సీనియర్ కాంగ్రెస్ నేతల అనుచరులు కూడా రంగంలోకి దిగడంతో బుజ్జగింపులు కత్తి మీద సాములాగా మారాయంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు బుజ్జగించినా పెద్దగా ఫలితం ఇవ్వకపోవడంతో తలలు పట్టుకున్నారట.తమ నేతల మధ్య పోటీ ఎక్కడ విపక్షాలకు మేలు చేస్తుందోనన్న టెన్షన్ అధికార పార్టీ నేతల్లో కనిపిస్తోందట. పైకి మాత్రం ఎవరు గెలిచినా తమ పార్టీ వారే కదా అంటున్నప్పటికీ..ఇంటిపోరు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తాను బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కూడా నామినేషన్లు వేశారట.మొదటి దశ పోలింగ్ జరిగే మెజార్టీ పంచాయతీల్లో




దాదాపుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్గీయులే బరిలో ఉన్నారట. రాజకీయంగా ప్రభావం చూపే సర్పంచ్ ఎన్నికల్లో మంత్రి అనుచరులు బరిలో నిలవడంతో నకిరేకల్ హస్తం రాజకీయం వేడెక్కుతోంది. మార్కెట్ కమిటీల నియామకం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం మధ్య గ్యాప్ పెరిగిందనే ప్రచారం బలంగా ఉంది. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే కావడంతో సీనియర్ నేతలు కూడా తమకు ఎందుకొచ్చిన లొల్లి అని మౌనంగా ఉంటున్నారట.మంత్రి అండ చూసుకొని కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే వేముల వీరేశం అసహనంగా ఉన్నారట. మంత్రి కూడా నో డిస్కషన్స్..మన మనుషులు బరిలో ఉండాల్సిందేనని పట్టుబట్టడంతో పలు చోట్ల పోటీ తప్పలేదని అంటున్నారు. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే వ్యూహాలకు పదును పెడుతుండటంతో నకిరేకల్ కాంగ్రెస్ రాజకీయం వేడుక్కుతోంది. ఇక తుంగతుర్తి నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయులు, దివంగత నేత దామోదర్ రెడ్డి వర్గీయులు పోటా పోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గంలో బరిలో ఉన్నవారిలో ఎక్కువ మంది తమ పార్టీ వాళ్లేనని హస్తం పార్టీ నేతలే చెప్తున్నారు.కొత్త కాంగ్రెస్, పాత కాంగ్రెస్‌గా విడిపోయిన క్యాడర్..ఎవరికి వారు నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలోని 90శాతం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సపోర్టర్సే బరిలో ఉన్నారుట. పలుచోట్ల ముగ్గురు కాంగ్రెస్ మద్ధతుదారులు పోటీలో ఉండటంతో క్యాడర్ తలలు పట్టుకుంటున్నారట. ఓవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు దామోదర్ రెడ్డి వర్గంగా విడిపోయి ఎవరికి వారు పోటీ చేస్తుండడంతో ఎవరికి ఎవరు నచ్చచెప్పాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందట.సూర్యాపేట నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి వర్గంగా విడిపోయి బరిలో నిలిచారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చెందిన హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లోనూ పలుచోట్ల సొంత పార్టీ నేతలే పోటీ పడుతుండటం ఆశ్చర్యంగా మారింది. మొదటి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేస్తే..రాకరాక ఈ సారి అవకాశం వచ్చిందని..సమీకరణాల పేరుతో కొత్తవారికి టికెట్ ఇస్తున్నారంటూ పాత క్యాడర్ తీవ్ర ఆందోళనకు గురవుతోందట.మిర్యాలగూడలో కూడా పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతల మధ్యే హోరాహోరీ పోరు కొనసాగుతోంది. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాకపోవడం..ఎవరు గెలిచినా తమ పార్టీనే కదా అన్న ధీమాతో ఎమ్మెల్యేలు పలుచోట్ల పల్లె పాలిటిక్స్ జోలికి పోవడం లేదు. ఎవరు గెలిచినా పార్టీకి నష్టం లేదని ఎమ్మెల్యేలే అంటున్నారట. అయితే ముఖ్యనేతలను నమ్ముకొని పోటీ చేసి ఆర్థికంగా నష్టపోతే తమ పరిస్థితి ఏంటని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారట.మరోవైపు అధికార పార్టీ అన్న తర్వాత ఆశావహులు ఎక్కువగా ఉంటారని కవర్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. ఇదే అదనుగా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో తమ మద్ధతుదారులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతోంది. పలుచోట్ల వామపక్ష పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు గులాబీ లీడర్లు.

# లోకల్ లైట్...

**హైదరాబాద్ :** పార్టీ పవర్‌లో లేదు. పైగా సిచ్యువేషన్స్ బాలేవు. పోనీ పట్టుబట్టి అభ్యర్థులను గెలిచిపించినా.. ఎన్నికయ్యాక వాళ్లు పార్టీలో ఉంటారో జంప్ అవుతారో తెలియదు. ఎందుకొచ్చిన టెన్షన్. లైట్ తీసుకుంటే పోలా అంటోందట బీఆర్ఎస్. అందుకే సర్పంచ్ ఎన్నికలపై గులాబీ పార్టీ సీరియస్‌గా ఫోకస్ పెట్టడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఓవైపు సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని జిల్లాల టూర్ చేస్తుంటే..బీఆర్ఎస్ మాత్రం కనీసం పట్టించుకోవడం కాదు కదా..ఓ సమీక్ష కూడా చేయకపో వడం చర్చకు దారితీస్తోంది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రాజకీయం అంతకంతకు హీటెక్కుతోంది. నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. చాలా చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అయితే పంచాయతీ ఎన్నికల వేళ..జిల్లా టూర్‌లో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేస్తున్నారు. ప్రజాపాలన రెండేళ్ల సంబరాల పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్న రేవంత్..సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరాల జల్లులు కురిపిస్తున్నారు. వెళ్లిన చోటల్లా పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు ముఖ్యమంత్రి. సాధ్యమైనంత వరకు మెజారిటీ పంచాయతీలను గెలుచుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇండైరెక్ట్‌గా పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చెబుతున్నారు. దీన్ని బట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు.ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మాత్రం పంచాయతీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటమి తర్వాత ఇంకాస్త నిరాశ చెందిన గులాబీ పార్టీ ఇంకా దాని నుంచి బయటకు రాలేకపోతోందన్న చర్చ జరుగుతోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు అంటే ఎలాగూ అధికార పార్టీదే పైచేయి ఉంటుంది. పైగా పట్టుబట్టి అభ్యర్థులను పెట్టి గెలిపించినా వారు పార్టీలో ఉంటారో లేదోనన్న డైలమా ఉందట. అన్నింటికి మించి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ఫండింగ్ చేయడం కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ఇప్పుడున్న పరిస్థితుల్లో భారంగా మారనుంది.ఈ అంశాన్నింటిని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికలను లైట్ తీసుకుందట బీఆర్ఎస్. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉంటుంది కాబటి..అప్పుడు ఎంతో కొంత ఫోకస్ చేయాలని భావిస్తోందట. మెయిన్‌గా అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పని చేసుకుంటూ పోవాలనేది బీఆర్ఎస్ కారు పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. 20 నుంచి 30 నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని తెలంగాణ భవన్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. పార్టీ క్యాడర్ స్ట్రాంగ్‌గా ఉన్నచోట..ఎమ్మెల్యేలు అండదండలు ఉన్న దగ్గర..కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటున్నారట బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు. రాష్ట్ర పార్టీ మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదని..అంతర్గతంగా మాజీ మంత్రులు ఓసారి జిల్లాల వారీగా సమీక్ష చేశారని అంటున్నారు.పంచాయతీ ఎన్నికలను కారు పార్టీ లైట్ తీసుకోవడానికి ఎన్నో రీజన్స్ ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించుకున్నా ఆ తర్వాత వాళ్లను అధికార కాంగ్రెస్.. పార్టీలో చేర్చుకుంటుందని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికే చాలాచోట్ల బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలనుకున్న సర్పంచ్ అభ్యర్థులు..కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు వెళ్లిపోయారని గులాబీ పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో కారు పార్టీ నుంచి పోటీ చేసేందుకు కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా లేరన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ తాము బలపరిచిన అభ్యర్థులు గెలిచినా..అభివృద్ధి పేరుతో హస్తం గూటికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా స్థానిక ఎన్నికలపై పార్టీ చేతులు ఎత్తేస్తే రానున్న రోజుల్లో క్యాడర్ చేజారిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్‌లో అంతర్గత చర్చ జరుగుతోంది

## స్టార్టప్‌లకు కేంద్రంగా హైదరాబాద్

-మొదటిపేజీ తరువాయి

నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా? లేదా? అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నాను. ఓయూకి వెళ్లే ధైర్యం ఎందుకు చేస్తున్నారని గతంలో నన్ను చాలా మంది అడిగారు. నాది ధైర్యం కాదు.. అభిమానం. మన భవిష్యత్తు ప్రణాళికలు రాసుకునేందుకు ఇక్కడికి వచ్చాను. ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చదిద్దాలనేది నా సంకల్పం.

**ఎంతోమంది ప్రముఖులను ఓయూ అందించింది**

తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు?

**విద్య మాత్రమే ఆత్మగౌరవాన్ని పెంచుతుంది**

నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడుతున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుంది.

**చైనాకు కూడా ఇంగ్లిష్ రాదు.. కానీ..**

విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండి" అని రేవంత్ అన్నారు.

**ఓయూకు రూ.వెయ్యికోట్లు.. ఉత్తర్వులు జారీ**

ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ మోసం చేశాడని మండిపడ్డారు. రూ. 2 లక్షల రుణ మాఫీ కావాలంటే రూ. 50 వేల కోట్లు కావాల్సి ఉంటుందన్నారు. రూ. 12 వేల కోట్లతో కేవలం 25 శాతం మందికి మాత్రమే రుణ మాఫీ చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయి సీఎం రేవంత్ రెడ్డి అంటూ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తాము ఇచ్చిన ఉద్యోగాలను నువ్వు ఇచ్చినట్లు చెప్పుకుంటావా? అని సీఎం రేవంత్ రెడ్డిపై ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. అధికారంలోకి వచ్చి.. రెండేళ్లు అయినా ఇంకా అబద్దాలే చెబుతావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలు ఇచ్చి.. ఒక్కటీ అమలు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఈ పర్యటనలో ఇన్సురెన్స్ బాండ్లను కేటీఆర్ పంపిణీ చేశారు. 2023 ఏడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇక పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల ఫలితాలతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పలు హామీలు ఇచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా.. ఇంకా అమలు చేయడం లేదంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వరుసగా విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

## తెలంగాణలో ఇలా

**హైదరాబాద్ :** తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 16వ తేదీ దాకా చలి గాలులు వీస్తాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. రాబోయే 7 రోజుల్లో చలిగాలులకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. డిసెంబర్ 10 నుంచి 13వ తేదీ మధ్య చలిగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు. తాజాగా ఉదయంపూట అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి.సంగారెడ్డిలో 6.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అసిఫాబాద్ 6.6, ఆదిలాబాద్ 6.8, వికారాబాద్ 7.8, కామారెడ్డి 8.2, నిజామాబాద్ 8.4, మెదక్ 8.4, రంగారెడ్డి 8.4, సిద్దిపేట 8.9, నిర్మల్ 9.0, సిరిసిల్ల 9.2 ఉష్ణోగ్రతలు ఈ ఉదయం నమోదు అయ్యాయి.భాగ్యనగరంలోనూ చలి వణికిస్తోంది. శేరిలింగంపల్లి 8.4, రాజేంద్రనగర్ 10.1, అల్వాల్ 10.6, బీహెచ్ఈఎల్ 10.6, ఆర్సీ పురం 12.2, నేరెడ్‌మెట్ 12.4, చందానగర్ 12.4, కంచన్‌భాగ్ 13.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.జనాలు విపరీతమైన చలి కారణంగా ఎక్కువగా ఇళ్లలోనే ఉండిపోతున్నారు. మంటలకు దగ్గరగా ఉంటున్నారు. ఏఎస్ఆర్ జిల్లాలోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేసింది. ఉదయంపూట ఎటు వెళ్లలేని పరిస్థితి. పొగమంచుతో దారులు సరిగా కనిపించడం లేదు. ఆదివారం జి మాడుగులలో 5.3 డిగ్రీల సెల్సియస్, ముంచింగిపుట్టులో 7.7 డిగ్రీలు, అరకు వ్యాలీలో 8.9, లంబసింగిలో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లె వద్ద 9.5 డిగ్రీలుగా నమోదైంది. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం గడ్డకట్టే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. విశాఖ నగరంలో అత్యల్ప ఉష్ణోగ్రత 17.4 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు చలిగా భావించారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో ఆదివారం 15.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరప్రాంతం, రాయలసీమ ప్రాంతాలలో ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. రాబోయే రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నట్టుగా వాతావరణ శాఖ అంచనా వేసింది.దిత్వా తుపాను, వర్షపాతం కారణంగా నవంబర్‌లో పర్యాటకుల రాక తగ్గిందని ఏఎస్ఆర్ జిల్లాలోని స్థానికులు తెలిపారు. మళ్లీ పర్యాటక రాక పెరుగుతుందని భావిస్తున్నారు.అంతకుముందు నవంబర్ 19వ తేదీన చింతపల్లెలో ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. జనవరి 8, 2023లో చింతపల్లెలో 1.5 డిగ్రీల సెల్సియస్‌ని తాకింది. ఉదయం వేళల్లో ప్రయాణికులు ఎటైనా వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కప్పేస్తుంది. రహదారులు కనిపించడం లేదు. రాబోయే రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.

## సంపాదకీయం

# కాలుష్య నిలయం న్యూఢిల్లీ

'రష్యా అధినేత పుతిన్ ఢిల్లీ సందర్శించారు' అ ని ఇది చారిత్రక యాత్ర అని జబ్బలు చరుచుకుంటున్న ప్రభుత్వం, విశ్వనగరాలలో నివాసయోగ్యం కాని నగరం ఏదైనా ఉందా అంటే అది ఢిల్లీ అని పిల్లల దగ్గర నుంచి చాట్‌జిపిటి ఒకే సమాధానం చెబుతున్నారు. ఢిల్లీ, శనివారం నాడు మరోసారి విషజన్య వాయువు పొగతిమ్మడుతో మగ్గిపోయింది. నగరంలో వాయు ప్రమాణం 330 వద్ద నిలిచిపోయింది. ఇది 'చాలా చెడు' విభాగంలో ఉంటుందని సూచిస్తుంది. ఇది 24 గంటల సగటు ఎక్యూఐ గా నమోదయింది. ఢిల్లీ నగరంలో 40 వాయు గమన కేంద్రాల్లో 31 కేంద్రాలు 'చాలా చెడు' స్థాయిలో నమోదయ్యాయి. సిబిపిబి సమీర్ యాప్ ప్రకారం నెహ్రూనగర్ అతి పెద్ద ఎక్యూఐ స్థాయిని 369గా నమోదుచేసింది. శనివారం ఉదయం ఢిల్లీవాసులు మరోసారి గాలి కంటే చూర్ణమైన వాయు ద్రవ్యరాశిని తట్టుకున్నారు. ఉదయం 9 గంటలకు ఎక్యూఐ 335కి చేరుకుంది. మొత్తం 36 గమన కేంద్రాలు 'చాలా చెడు' స్థాయిలో ఉన్నాయి. ముంధకా 387వరకు అత్యంత హానికరమైన గాలి నాణ్యతను నమోదు చేసింది. వాయు నాణ్యతపై ప్రభావం వరుసగా చాలా రోజులు దరిద్రంగా తయారైంది. సిబిపిబి ప్రకారం, 0-50 ఎక్యూఐ మంచి గా, 51-100 సంతృప్తికరమైనగా, 101-200 మోడరేట్‌గా, 201-300 చెడుగా, 301-400 చాలా చెడుగా, 401-500 తీవ్రమైనగా పరిగణించబడుతుంది. శనివారం రాత్రి, ఢిల్లీ వాయు నాణ్యత 330 వద్ద నమోదైంది. ఇది ఢిల్లీ గురించి తీవ్రమైన కాలుష్యాన్ని సూచిస్తుంది. వాయు నాణ్యత దిగజారడానికి అనేక కారణాలు ఉన్నాయని సమాచారం. ఢిల్లీ వాయు నాణ్యత నిర్వహణ కోసం నిర్ణయ సహాయ వ్యవస్థ ప్రకారం, రవాణా వాయు కాలుష్యానికి ప్రధాన కారణం కావడం గమనించబడింది. ఇది మొత్తం కాలుష్యలో 14.8% కంటే ఎక్కువ బాధ్యత వహిస్తుంది. దీనికి తరువాతి కారణాలు ఢిలీ, పరిసర ప్రాంతాలలో ఉన్న పరిశ్రమలు (7.3%), గృహకాలుష్య మూలాలు (3.6%), నిర్మాణాలు (2%) అని గుర్తించబడ్డాయి. గత రెండురోజులు ప్రజారోగ్యపట్ల భయంకరమైన ప్రభావం చూపుతోంది. దీని కారణంగా ఢిల్లీవాసుల ఆరోగ్యం తీవ్రమైన ప్రభావాలను ఎదుర్కొంటున్నాయి. 2022, 2024 మధ్య ఢిల్లీలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2,00,000కి పైగా ప్రాథమిక శ్వాసకోశ సంబంధిత రోగాల కేసులు నమోదయ్యాయి. ఈ గడువులో 30,000 మందికిపైగా ప్రజలు ఆసుపత్రిలో చేరినట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొంది. పార్లమెంట్ లో ఇచ్చిన సమాచారం ప్రకారం, ఢిల్లీలో ఉన్న శ్వాసకోశ సంబంధిత కేసులు 2022లో 67,054, 2023లో 69,293, 2024లో 68,411 గా నమోదు అయ్యాయి. 2025 నవంబర్ నాటికి లక్ష దాటినట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. దీనికి తోడు చల్లని వాతావరణం ఢిల్లీని మరింత ఇబ్బందిపెడుతోంది. పరిసర వాతావరణం కూడాఢిల్లీని బాధిస్తోంది. శుక్రవారం ఉదయం ఢిల్లీ వాతావరణ శాఖ ప్రకారం, ఢిల్లీ నూతన సంవత్సరానికి ముందు చల్లని ఉదయం గమనించింది. బుధవారం 5.6 డిగ్రీల సెల్సియస్ (3.9 డిగ్రీలు సాధారణం కంటే తక్కువ) నమోదైంది. వాతావరణం కారణంగా ఢిల్లీ వాయు నాణ్యత మరింత దిగజారిపోయింది. శనివారానికి వాయు నాణ్యత ఇంకా పడిపోయింది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్, నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి, వ్యవసాయానికి, మానవుని అభివృద్ధికి తోడ్పడుతుంది. వాయు కాలుష్యం తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు కారణమయ్యే పియం 2.5, పియం 0.5 వంటి చక్కటి రేణువుల హానికరమైన పదార్థాలను కలిగి ఉంది. ఎసిలు, రిఫ్రిజిరేటర్లు విపరీతంగా వాడడం వలన క్లోరోఫ్లోరో కార్బన్లు, ద్రావకాలు, రిఫ్రిజిరేటర్లకు ఉపయోగించే వాయువుల ద్వారా ఓజోన్ పొరను నాశనం చేసి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు సాంద్రత పెరగడం వల్ల గ్రీన్హౌస్ ప్రభావం వాతావరణంలో పర్యావరణ విధ్వంసం సమస్యగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఢిల్లీని పాలిస్తున్న ప్రభుత్వాలు కాలుష్య సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు చూపాల్సిన అవసరం ఉంది. దీనితో పాటు ప్రభుత్వాలు, పరిశ్రమలు, మీడియా, ప్రజల సహకారం అవసరం.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ ముఖర్జీ



సీనియర్ నాయకుడు, భారత మాజీ రాష్ట్రపతి, బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ కుమార్ ముఖర్జీ వ్యక్తిత్వం స్వతంత్ర్య భారతావనిలో చెరగని ముద్ర. రాజకీయ కురువృద్ధుడైన ప్రణబ్ భారత దేశానికి 2012 నుండి 2017 వరకు 13వ రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వర్తించాడు. తన ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో అయన భారత జాతీయ కాంగ్రెస్ లో సీనియర్ నాయకునిగా ఉన్నాడు. కేంద్రప్రభుత్వంలో అనేక మంత్రిత్వ పదవులను నిర్వహించాడు. మేధావిగా, సంక్షోభ పరిష్కర్తగా ఆయనకెవరూ సాటి రారని రాజకీయ పక్షాలు అంటూంటాయి. ప్రణబ్ ముఖర్జీ డిసెంబరు 11, 1935న పశ్చిమ బెంగాల్ లోని బిర్భుమ్ జిల్లా మిరాటీ గ్రామంలో బెంగాలీ కులీన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి కమద కింకర ముఖర్జీ భారత స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీల సభ్యుడు. ఆయన తండ్రి 1952 నుండి 1964 వరకు పశ్చిమ బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ లో భారత జాతీయ కాంగ్రెస్ తరపున సభ్యునిగా, ఎఐసిసి సభ్యునిగా ఉన్నాడు. తల్లి రాజ్యలక్ష్మీ ముఖర్జీ. అప్పటి కాలంలో కలకత్తా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న సూరి (బిర్భుమ్) లోని సూరి విద్యాసాగర్ కళాశాలలో చదివాడు. తరువాత రాజనీతి శాస్త్రం, చరిత్రలో ఎం.ఎ. చేసాడు. కలకత్తా విశ్వ విద్యాలయం నుండి ఎల్.ఎల్.బి డిగ్రీని పొందాడు. 1963 లో కలకత్తా లోని డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (తపాలా, టెలిగ్రాఫ్) కార్యాలయంలో అప్పర్ డివిజనల్ క్లర్క్ (యు. డి. సి) ఉద్యోగంలో చేరాడు. తరువాత విద్యానగర్ కళాశాలలో రాజనీతి శాస్త్రం బోధించే అధ్యాపకునిగా విధులను నిర్వర్తించాడు. రాజకీయాలలోనికి రాక పూర్వం దేషేర్ దక్ పత్రికకు జర్నలిస్టుగా ఉండేవాడు. 1969 లో మిడ్నాపూర్ ఉప ఎన్నికకు సంబంధించిన రాజకీయ ప్రచారంలో భాగంగా స్వతంత్ర అభ్యర్థి వి. కె. కృష్ణ మేనన్ కు ప్రచార బాధ్యతలు చేపట్టడం ద్వారా ఆయన రాజకీయ జీవితం ప్రారంభ మయింది. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ అతని ప్రతిభను గుర్తించి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో స్థానం కల్పించింది. ఆలా 1969 లో రాజ్యసభకు ఎన్నికయ్యాడు. ఆ తర్వాత 1975, 1981, 1993, 1999 లలోనూ రాజ్యసభకు ఎన్నికవుతూ వచ్చాడు. గాంధీ కుటుంబ విధేయునిగా తనకుతాను అభివర్ణించుకున్నాడు. 1973లో తొలిసారిగా ఇందిరా గాంధీ కేబినెట్ లో పరిశ్రమల అభివృద్ధి శాఖకు కేంద్ర ఉప మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా అయన రాజకీయ జీవితం వేగంగా ఎదిగింది. 1975-77 లలో వివాదాస్పద అంతర్గత అత్యవసర పరిస్థితి వచ్చినపుడు కేబినెట్‌లో క్రియాశీలకంగా ఉన్నాడు. 1979లో రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ నాయకునిగా ఉన్నాడు. 1980లో సభానాయకుడిగా ఎన్నికై బాధ్యతలు చేపట్టాడు. ప్రణబ్ ముఖర్జీ అగ్ర శ్రేణి క్యాబినెట్ మంత్రిగా పరిగణింప బడ్డాడు. ఆయన ప్రధాన మంత్రి లేని సమయంలో కేబినెట్ సమావేశాలకు అధ్యక్షత వహించే స్థాయికి ఎదిగాడు. 1978 జనవరి 27 న కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యునిగా ఉన్నాడు. అదే సంవత్సరం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) సెంట్రల్ పార్లమెంటరీ బోర్డులో సభ్యునిగా చేరాడు. 1978లో ఎఐసిసికి కోశాధికారిగా పనిచేసాడు. 1984, 1996, 1998 జరిగిన భారత సార్వత్రిక ఎన్నికలలో ఎఐసిసి ప్రచార కమిటీకి చైర్మన్ గా నియమింపబడ్డాడు. 1999 జూన్ 28 నుండి 2012 వరకు ఎఐసిసి సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీకి చైర్మన్ బాధ్యతలను నిర్వహించాడు. 2001 డిసెంబరు 12 న అతను సెంట్రల్ ఎన్నికలు కమిటీకి నియమింప బడ్డాడు. 1998 లో ఎఐసిసి జనరల్ సెక్రటరీగా నియమితుడు అయినాడు. 1997 లో ముఖర్జీ భారత పార్లమెంటరీ సమూహంచే "అత్యుత్తమ పార్లమెంటేరియన్"గా గుర్తింపబడ్డాడు. సోనియా గాంధీ రాజకీయాల్లో చేరడానికి అయిష్టంగా అంగీకరించిన తరువాత, ముఖర్జీ ఆమె సలహాదారులలో ఒకరిగా మారాడు. ఇందిరాగాంధీ ఏయే సమస్యను ఎలా పరిష్కరించే వారో, ఏ సంక్షోభంలో ఎలా వ్యవహరించే వారో ప్రణబే సోనియాకు చెప్పాడు. అలా సోనియాకు మొట్టమొదటి రాజకీయ గురువుగా వ్యవహరించాడు. అదే సమయంలో పార్టీకీ, సోనియాకూ విధేయంగానూ ఉంటూ వచ్చాడు. కాంగ్రెస్ సీనియర్ నాయకునిగా 1998 లో సోనియా గాంధీ పార్టీ అధ్యక్షురాలిగా కావడానికి ప్రధాన పాత్ర పోషించాడు. 2005 ప్రారంభంలో పేటెంట్ సవరణ బిల్లు కోసం జరిగిన చర్చల సమయంలో అయన ప్రతిభను ప్రదర్శించాడు. 2008-09 లో భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు బై-పాస్ సర్జరీకి వెళ్లినపుడు ముఖర్జీ లోక్‌సభ ఎన్నికలకు ముందు క్యాబినెట్ ను నడిపించే కీలక పాత్రను పోషించాడు. ఈ సమయంలో ఆయన రాజకీయ వ్యవహారాలు కేబినెట్ కమిటీకి చైర్మన్ గాను, ఆర్థిక మంత్రిత్వ శాఖకు కేంద్ర మంత్రిగా అదనపు బాధ్యతలను స్వీకరించాడు. 2011లో "ఉత్తమనిర్వహణాధికారి" పురస్కారాన్ని పొందాడు. 2012 జూన్ 15న ముఖర్జీ అనేక రాజకీయ ఎత్తుగడల తరువాత యు.పి.ఎ తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ చేయ బడ్డాడు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాష్ట్రపతి ఎన్నిక 2012 జూలై 19 న జరగాలని, ఫలితాలను 2012 జూలై 22 న ప్రకటించాలని ఉంది. 81 మంది ఇతర సభ్యులు ఎన్నికలలో పోటీచేస్తూ నామినేషన్లు వేసారు. కానీ నేషనల్ డెమోక్రటిక్ అలియన్స్ (ఎన్. డి. ఎ) ప్రతిపాదిత అభ్యర్థి పి.ఎ.సంగ్మా నామినేషన్ తప్ప మిగిలినవన్నీ తిరస్కరించబడ్డాయి. జూన్ 28 న నామినేషన్ వేయడం కోసం జూన్ 2012 జూన్ 26 న తన మంత్రి పదవికి రాజీనామా చేసాడు. ఎన్నికలలో అతను 713,763 ఓట్లను సాధించగా, సంగ్మాకు 315,987 ఓట్లు వచ్చాయి. ముఖర్జీ 2012 జూలై 25న అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తిచే భారత 13వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసాడు. అయన ఈ పదవి నిర్వహించిన వారిలో బెంగాల్ రాష్ట్రానికి చెందిన మొదటి వ్యక్తి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, అప్పటి ప్రధాన మంత్రి మన్ మోహన్ సింగ్లు అతనికి శుభా కాంక్షలు తెలిపారు. పూర్వపు కమ్యూనిస్టు నాయకుడు సోమనాథ్ ఛటర్జీ ముఖర్జీని "భారతదేశ ఉత్తమ పార్లమెంటేరియన్, రాజనీతిజ్ఞుడు"గా కొనియాడి "ఉన్నత పదవిలో అత్యంత సామర్థ్యం ఉన్న వ్యక్తి వచ్చాడు" అని తెలిపాడు. ప్రతిపక్ష నేత శరద్ యాదవ్ "దేశానికి ప్రణబ్ ముఖర్జీ లాంటి అధ్యక్షుడు అవసరం." అని వ్యాఖ్యానించాడు. ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ముఖర్జీ "తెలివైన అధ్యక్షుల్లో ఒకరు" అని వ్యాఖ్యానించింది.

# ఎన్నికల తీరు మారితేనే కల నెరవేరేది!

'తెలంగాణలోని గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడిగా నడుస్తున్నది. ఎన్నికలు మూడు దశల్లో నడుస్తున్న తరుణంలో ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు రాజకీయ పార్టీలు కాలంతో పోటీపడి పనిచేస్తూ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. రెండు సంవత్సరాల నుండి పంచాయతీ ఎన్నికలు నిర్వహించ కపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన సమస్యలకు పరిష్కారాల్ని చూపే అసలైన గ్రామ స్వపరిపాలన కోసం పల్లెలన్నీ ఆశగా ఎదురుచూస్తున్నాయి. తెలంగాణలో 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు 1 కోటి 60 లక్షల ఓటర్లతో ఎన్నికల రణరంగం సిద్ధమైనది. గ్రామంలోనే దేశం ఉంది. అవి అంతరించిపోతే దేశమే అంతమయ్యే ప్రమాదం ఉన్నది. పల్లెసీమలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. అలా నడవాలంటే ఎన్నికల ప్రక్రియనే కీలకం. అలాంటి కీలకమైన ఈ దేశ ఎన్నికల ప్రక్రియలో గ్రామస్థాయినుంచే సమూలమైన మార్పులు తేవాలి. కానీ మన దగ్గర అది పంచాయతీ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా వాటి తీరు 'ప్రలోభాల' పర్వమే తప్ప ప్రగతి సూత్రంగా లేదు. రోజులు గడుస్తున్నా కూడా పార్టీల జెండాలే తప్ప ప్రజా 'ఎ'జెండాలు ముందుకు వెళ్లే పరిస్థితులు కనబడడం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభంగా, నాయకుడి ఎంపికలో నిర్ణయాత్మకమైన శక్తిగా నిలిచే 'ఓటు'ను డబ్బుతో, మద్యంతో, పరపతి, ప్రలోభాలతో చట్టవిరుద్ధమని తెలిసిన కూడా యథేచ్ఛగా లాక్కుంటున్నారు. ప్రజల నిజాయితీని పక్కదారిపట్టించి ప్రలోభాల రొంపిలోకి దించారు. వీరి ప్రవర్తన, విధానాల వలన ఈతరమే కాదు భవిష్యత్తు తరాలు కూడా తీవ్రంగా నష్టపోతాయి. ఈ ధోరణి ఇప్పటికే సమాజంలో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఇది ఇలానే కొనసాగితే రానురాను ఎటువైపు దారి తీస్తుందో..? ఏ రూపు దాలుస్తుందో..? రేపటికి ఏ సంకేతం ఇస్తుందో..? ఊహిస్తేనే ఆందోళన కలిగిస్తున్నది. మనదేశ ప్రజాస్వామ్య వ్యవస్థనే మరింత ప్రమాదంలోకి నెట్టుతున్నది. వీటన్నిటికి మన రాజకీయ పార్టీల ఎన్నికల విధానాలు, వైఖరినే కారణం. స్వరాజ్యం కొద్దిమంది అధికారాన్ని చేజిక్కించుకున్నంత మాత్రానరాదు, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకున్నచోట అడ్డుపడనప్పుడు మాత్రమే వస్తుంది. నేడు ఆ స్వరాజ్యం లేదు.. రాజ్యం చేజిక్కించుకోవడం కోసం ఎలాంటి అధికార దుర్వినియోగా నికైనా సిద్ధపడడమే ఉంది. వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులకు పైఎత్తులు, పొత్తులు, జిత్తులు, జిమ్మిక్కులు, రాజకీయాల సహజ స్వభావాన్ని మార్చేశారు. ఎవరు ఏ పార్టీలో ఉంటారో.. ఎప్పుడు మారుతారో.. అధికార దాహం కోసం ఏం చేయడా నికి అయినా ఎలా సిద్ధపడతారో ఎవరికి అర్థం కానీ స్థితి ఉన్నది. ఈనాటి రాజకీయ ప్రక్రియలో తమ స్వార్థం, రాజకీ య దాహం తప్ప ప్రజల కోణం లేదు. కుట్రలు, కుతంత్రాలు, స్వార్థం, స్వప్రయోజనాలే కానీ మంచికి మానవత్వానికి, నీతికి, నిజాయితీకి అవకాశం లేదు అన్నట్టుగా ఉంది. నేటి రాజకీయ పరిస్థితులను గమనిస్తే, సామాన్యుడికి రాజకీయాల్లో స్థానం లేదని, భవిష్యత్తులో కూడా రాదని స్పష్టంగా కనబడుతున్నది. ఎన్నికల్లో పోటీకి నిలబడితే ఏం చేస్తావు..? ఎలా చేస్తావు..? అని అడిగే పద్ధతులు పోయి నీ వద్ద ఎన్ని పైసలు ఉన్నాయి..? ఎంత పెడతావు..? ఎంత ఇస్తావు..?అని బహిరంగంగా మాట్లాడే దుస్థితికి వచ్చింది. అభివృద్ధికి పాటుపడే వ్యక్తుల విధానపరమైన ప్రవర్తన, పని విధానం, నిజాయితీ, నిబద్ధతలను పరిగణనలోకి తీసుకోకుండా అభ్యర్థుల కుల, ధన, బల, బలగాలను బేరీజు వేసుకొని ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా నడిచే దుస్థితి ఉన్నది. అభ్యర్థులను ఎంపికచేసే దగ్గర కూడా కొద్దిమంది వ్యక్తులే కూర్చొని శాషిస్తూ అభ్యర్థుల భవితవ్యాన్ని ఖరారు చేసే రాచరికపు పోకడలకు నిలయంగా మారింది. చివరికి విలువలతో బతకాల్సిన విద్యావంతులు సైతంజెండా, ఎజెండాలు ఏమీ లేక ఎవరికి పడితే వారికి జై కొట్టే అయోమయ పరిస్థితి వచ్చింది. ఇవన్నీ కూడా సమాజ అభివృద్ధికి పురోగమనం కాదు తిరోగమనమే. మనదేశంలో రాజకీయ వ్యవస్థ పెట్టుబడిదారి వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ఎలక్షన్ అంటేనే కలెక్షన్ అన్నట్టుగా ఎంత పెట్టాలి..? గెలిచిన తర్వాత తిరిగి ఎంత రాబట్టాలి ..? అని ముందే లేక్కలు వేసుకొని రంగంలోకి దిగే పరిస్థితులు వచ్చాయి. సేవ చేసేందుకు కాదు సంపాదించేందుకే రాజకీయాలను వాడుకుంటున్నారు. రాజకీయాల్లో వ్యక్తి, గుణగణాలు, వయస్సు తదితర రాజ్యాంగ నియమాలకు సంబంధించిన హక్కులు పోయి 'డబ్బే' ప్రధాన హక్కుగా నేడు మారింది. ఎన్నికల్లో పోటీ చేయాలంటే డబ్బే ఉండాలి, డబ్బు ఉన్నోళ్లే కావాలి అనే పరిస్థితులు వచ్చాయి. డబ్బు చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే సామాన్యులకు రాజకీయాల్లో స్థానం లేదని, భవిష్యత్తులో కూడా రాదనేది అక్షర సత్యం. కాళోజీ లాంటి మహనీయులు జరుగుతున్న తీరును గమనించే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు, ఏ పాటివాడో చూడు, ఎన్నుకుంటే ఏం చేస్తాడో కాదు ఇప్పటివరకు ఏం చేశాడో చూడు, పెట్టిన టోపీని కాదు.. పెట్టే టోపీని చూడు అంటూ చైతన్యం చేశాడు. అయినా ప్రజలు చైతన్యం కాలేదు.. ప్రజల్ని విభజించి వారి ఆలోచన శక్తిని చంపి తమ అనుచరులుగా మలుచుకున్నారు. కాబట్టే పార్టీల జండాలే తప్ప వారికి మరొకటి అర్థం కాదు. వారి అభివృద్ధి, అభ్యున్నతి ఆలోచన రాదు. అందుకే ప్రజలు ఎక్కడ ఉన్నారో అక్కడనే మిగిలారు. అభివృద్ధి కూడా అలానే మిగిలింది. కానీ మనల్ని ఏలే నాయకులు మాత్రం కోట్లాది రూపాయలకు అధిపతులుగా మారారు. అందువల్లనే నాయకుల్లో ఎదుగుదల ఉన్నది కానీ ప్రజల్లో ఎదుగుదల లేదు. ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలే ఎన్నుకోబడే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే న్యాయ నిర్ణేతలు. వారి నిర్ణయాధికారం మీదనే పాలన వ్యవస్థ ఆధారపడి ఉన్నది. కానీ ప్రజలు ఆ నిర్ణయాధికార శక్తి ఏంటో..? ఒక్కసారి ఉపయోగిస్తే ఎలా ఉంటుందో..? ఎలాంటి మార్పులు తెస్తుందో.. తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు. తాత్కాలిక ప్రయోజనాల గురించి ఆలోచించడం మాని దీర్ఘకాలిక ప్రయోజనాలు మార్పుపై దృష్టిపెటి ప్రజాస్వామ్యయుతంగా, విశ్వజనీయమైన, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత పద్ధతిలో ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటును వినియోగించుకుంటే మహోత్తరమైన మార్పులు ఎన్నో జరుగుతాయి. ఆ మార్పులన్నింటికీ వజ్రాయుధం మన ఓటే. నా జాతి ప్రజలకు కత్తిని ఆయుధంగా ఇవ్వలేదు.. ఓటునే ఆయుధంగా ఇచ్చాను, పోరాడి రాజులవుతారో లేక ఓడిపోయి (అమ్ముకొని) బానిసలు అవుతారో తేల్చుకోవాలని అంబేద్కర్ సందేశం ఇచ్చారు.. ఓటు హక్కు సాధించిన అనంతరం ఓటు ఆవశ్యకతను, అవసరతను వివరించారు. కానీ దురదృష్టవశాత్తు రాజ్యాంగంలో ఓటు హక్కు వచ్చి 75 ఏళ్లు దాటిన కూడా ఇంకా ఓటు అవసరతను, ఆవశ్యకతను ప్రజలు గ్రహించడం లేదు. ప్రభుత్వ పరిధిలో ఉన్న అన్ని రాజ్యాంగ సంస్థలు, అధికారులు ఓటుపై ప్రజల్లో అవగాహన పెంచాలి. ఫోటో వరకే పరిమితమై చైతన్యం తెచ్చామంటే కాదు ఫోటో షూట్లు మానీ అధికార యంత్రాంగమంతా పల్లెబాట బట్టి ప్రజలకు ఓటు ఆవశ్యకతను వివరించాలి. 'ఓటర్లు చైతన్యమైనప్పుడు మాత్రమే పరిపాలన వ్యవస్థలో కానీ, పాలకుల ఆలోచన ధోరణుల్లో కానీ మార్పు వస్తుంది. ఓటరులో మార్పు రానంత కాలం సమాజంలో మార్పురాదు..' కాబట్టి ఓటరు పూర్తిగా మారాలి.. ఆ దిశగా మార్పు జరగాలి. నాయకుడి ఎంపికలో ఓటరే కీలకమైనప్పుడు అసమర్థున్ని ఎన్నుకొని బాధపడే కంటే ఎన్నికకు ముందే అన్ని ఆలోచించి సమర్థవంతమైన నాయకుడిని మాత్రమే ఎన్నుకోవాలి. అలా ఎన్నుకున్నప్పుడు మాత్రమే ఈ వ్యవస్థలో మార్పుతో పాటు ప్రజల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రశ్నించే స్వభావం పెరుగుతుంది. పాలనలో కూడా జవాబుదారీతనం ఉంటుంది. పాలన సరిగ్గా చేయకపోతే ప్రజలు నిలదీస్తారని భయం పాలకుల్లో కూడా ఉంటుంది. ఇవన్నీ ఓటు మీదనే ఆధారపడి ఉంది. ఇది జరగాలంటే ప్రస్తుత రాజకీయాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. స్వార్థంతో కాదు సామాజిక బాధ్యతతో పరిపాలించే వ్యవస్థ రావాలి. ప్రజలకు జవాబుదారీగా లేకుంటే, ప్రజలు వద్దనుకుని పాలకులను నేరుగా తొలగించే 'రీకాల్ సిస్టం' రావాలి. మన రాజకీయ వ్యవస్థలో వారసత్వ పోకడలు పోవాలి. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో ఉన్నట్టుగా పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు రెండుసార్లు మాత్రమే పోటీ చేసేలా నిబంధనలతో పకడ్బందీ చట్టాన్ని తేవాలి. రాజకీయాల్లో యువతరం, కొత్త రక్తం ఎదిగేలా ప్రోత్సహించాలి. ప్రజల్లో రాజకీయాలపై పేరుకుపోయిన చెత్తను, భ్రమల్ని పోగొట్టాలి. క్షేత్రస్థాయిలో వీటిని ఆచరణలో అమలు చేయాలి. అలా సంస్కరించినప్పుడే రాజకీయాలు రేపటి తరానికి ఆదర్శవంతంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.. ఇలా జరిగినప్పుడే ధనంతో సంబంధం లేకుండా చట్టం ప్రకారం ఒక సామాన్యుడు కూడా సమాజం కోసం పాటుపడతాడని, సేవ చేస్తాడనే విశ్వాసం పెరుగుతుంది.

# ఎన్నికలకు సామగ్రి పంపిణీ

**ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ బాదావత్ సంతోష్,**
**ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి ఊరుకొండ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అనే అంశాన్ని సమీక్షించారు. పోలింగ్ అధికారులకు అందజేస్తున్న పోలింగ్ మెటీరియల్‌ను స్వయంగా చెక్ చేసి, పంపిణీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది, ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా కలెక్టర్ పరిశీలించి, సిబ్బంది సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పర్యవేక్షణ చేయాలని మైక్రో అబ్జర్వర్‌లకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామాగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని, బ్యాలెట్ పత్రాలను ప్రత్యేక జాగ్రత్తతో చెక్కు చేసి ప్యాక్ చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తర్వాత అన్ని ఏర్పాట్లను మరోసారి నిర్ధారించుకోవాలని సూచించారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, పోలింగ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామగ్రి పంపిణీ సమయంలో ప్రతి పోలింగ్ బృందానికి అవసరమైన సామాగ్రి సమయానికి అందించేందుకు ప్రత్యేక డెస్కులను కలెక్టర్ పర్యవేక్షించారు. బృందాలు వచ్చిన క్రమానుసారం రిజిస్ట్రేషన్ నుంచి మెటీరియల్ పంపిణీ వరకూ మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఎక్కడ ఆలసత్వం, అయోమయం తలెత్తకుండా తగిన సూచిక బోర్డులు, సహాయక కేంద్రాలు ఏర్పాటు సరి చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలింగ్ సిబ్బందికి త్రాగునీరు, విశ్రాంతి గదులు, వైద్య అత్యవసర సదుపాయాల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సామాగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో బందోబస్తు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్, మార్గ సౌకర్యాలు సమగ్రంగా ఉండేలా చూడాలని, ఏవైనా లోపాలు కనిపించిన వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.





# పిచ్చి కుక్కల వీరంగం

**ఒకే గంటలో ఐదుగురిపై దాడి**
**ప్రజల్లో భయాందోళనలు**
**రామగుండం కార్పొరేషన్ అధికారులపై స్థానికుల ఆగ్రహం.**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** అన్నపూర్ణ కాలనీ వాసులు పిచ్చికుక్కల బెడదతో ఏ క్షణం చేస్తాయో అని భయాందోళనలకు గురవుతున్నారు. ఒకే గంట వ్యవధిలో పిచ్చికుక్కల గుంపు ఐదుగురు వ్యక్తులపై దాడి చేయడం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. చిన్నపిల్లల నుంచి వృద్ధులను ఎవరినీ వదలకుండా విరుచుకుపడిన ఈ సంఘటన కాలనీలో ఆందోళనతో పాటు అధికారులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**దాడిలో గాయపడిన వారు:**

ఈదునూరి బానేష్ (చిన్నారి)

ఈదునూరి భాగ్య,గోషిక దుర్గమ్మ, పెగడపల్లి రుద్ర, జి. నర్మద గాయాలతో రక్తస్రావం అవుతున్న చిన్నారులు, వృద్ధుల దుస్థితిని చూసిన వారెవరైనా కలత చెందక మానరు. కాలనీ వాసులు వెంటనే బాధితులను స్థానిక ఆసుపత్రికి తరలించగా, వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్నపిల్లల చేతులు, కాళ్లపై పగుళ్లతో కూడిన గాయాలు, రక్తం కారుతున్న దృశ్యాలు రామగుండం కార్పొరేషన్ పరిపాలన వైఫల్యానికి నిదర్శనం అని ప్రజలు మండిపడుతున్నారు.

**స్థానికుల ఆవేదన**

రోజూ ఇదే సమస్య ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారు తప్ప పరిష్కార మార్గానికి స్పందించడంలేదు. పిచ్చి కుక్కల దాడిలో పిల్లలు పెద్దలు రక్తమోడారు. ఇంకెవరిని బలి తీసుకోవాలి?" అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు, కోపొద్రక్తులవుతున్నారు. పిచ్చి కుక్కల సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతున్నప్పటికీ, కార్పొరేషన్ అధికారులు మాత్రం వట్టి మాటలు చెప్తున్నారన్నారు. చర్యలు తీసుకుంటామని మాటలు మాత్రమే పలుకుతున్నారు.ఒకే గంటలో ఐదుగురిపై దాడి జరగడం ప్రమాదం ఎంత తీవ్రమైందో అధికారులు కళ్ళు తెరిచి చూడాలన్నారు.







**ప్రజలు డిమాండ్:**

వెంటనే కాలనీలో డాగ్ మెనేస్ స్పెషల్ డ్రైవ్, బాధితులకు తక్షణ పరిహారం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధక చర్యలు, చేపట్టాలని ప్రజలు కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# సమస్యతో ఉన్నవారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

## హెచ్ఆర్సీఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండలరాజేందర్ కుమార్

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** సమస్యతో ఉన్నవారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హెచ్ఆర్సీఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండలరాజేందర్ కుమార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పెద్దపెల్లి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో రామగుండంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చెన్నుపాటి శ్రీకాంత్ ఆదేశాల మేరకు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి మాదాసి చారేంద్ర సూచనల మేరకు మానవ హక్కుల గురించి, నిత్యజీవితంలో మానవ హక్కుల ప్రాధాన్యత గురించి చర్చించారు, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని భారత ప్రజలకు రాజ్యాంగం అందించారని. రాజ్యాంగం భారత పౌరులుగా మనకు ఇచ్చిన ప్రతి హక్కులను వినియోగించుకోవాలని, సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి రామగుండం అక్బర్ నగర్ లోని హెచ్ఆర్సీఐ జిల్లా కార్యాలయం తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని, సమస్యతో మా దగ్గరికి వచ్చిన వారికి పరిష్కారం దొరికే వరకు అండగా ఉంటామని పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ తెలిపారు. తదనంతరం విటల్ నగర్ లోని అమ్మ పరివార్ అనాధాశ్రమంలో 100 మందికి భోజనాలను ఏర్పాటు చేసి, వీర్లపల్లిలోని ఈశ్వరా కృప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని పెద్దపెల్లి జిల్లా హెచ్ఆర్సీ అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండల రాజేందర్ కుమార్, బొంకూరి కైలాసం, సిహెచ్ చంద్రకాంత్, జాగటి శాంతమ్మ, గుండవెల్లి లక్ష్మి అబ్దుల్ సలీం, సిరికొండ కోటి, అజీమ్, డా, రామ్మూర్తి, సరిత, మురళి, సాయి కుమార్,తదితరులు పాల్గొన్నారు.



## "మానవత్వమే మతం

### ప్రేమ మతంతోనే సమాజానికి విముక్తి"

**ప్రొఫెసర్ డి.ఎం. రవిప్రసాద్**

**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):** సమాజంలో కుల మత విభేదాలు పెరుగుతున్న ఈ సమయంలో, మానవ విలువలను పునరుద్ధరించేందుకు "ప్రేమ మతం" అనే కొత్త ఆలోచనను ముందుకు తేవాల్సిన అవసరం ఉందని విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎం. రవిప్రసాద్ అన్నారు. పుట్టుకతో ఎవరూ ఏ కులమో ఏ మతమో కాదు, మనిషే మనిషి అని గుర్తుచేస్తూ"జంతువులు జంతువుల్లాగా జీవిస్తాయి, కానీ మనుషులు మాత్రం మనుషుల్లాగా జీవించడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.కులపేర్లతో, వర్గాలతో మనిషిని విభజించే సమాజ విధానాన్ని ప్రశ్నిస్తూ "మనల్ని మీరు రెడ్డీ, వెలమ, పద్మశాలి, మాల, మాదిగ అని ఎవరో పిలుస్తే ఎందుకు ఒప్పుకోవాలి? ఒకరు మనల్ని దున్నపోతు అని పిలిస్తే ఒప్పుకుంటామా, కులపేర్లు మాత్రం ఎలా ఒప్పుకుంటారు?" అని ఆయన ప్రశ్నించారు.మనిషికి పుట్టుకతో వచ్చిన గుర్తింపు మానవత్వం మాత్రమేనని తెలిపారు. ప్రేమ, ఐక్యత, సమానత్వం విలువలతో నడిచే సమాజ నిర్మాణానికి "ప్రేమ మతం" అవసరమని పిలుపునిచ్చారు. కులం మతం పేరుతో విభజన కన్నా, పరస్పర గౌరవం, సహజీవనం వైపు సమాజం సాగాలని సూచించారు. "మానవులుగా పుట్టిన మనం మానవుల్లాగే బతకాలి. మనమందరం ఐక్యంగా ప్రేమను మతంగా అంగీకరిద్దాం" అంటూ ప్రజలను రవిప్రసాద్ హితవు పలికారు

## పదవి లేకున్న తన సొంత డబ్బులతో గ్రామ అభివృద్ధికి కృషి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడకల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన దోకూరు ప్రభాకర్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రస్తుతం తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గ్రామంలో దేవాలయాలకు, పాఠశాలలకు గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ సహాయ సహకారాలను అందిస్తున్నారు.పదవిలో లేకపోయినా, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాలు, వ్యక్తిగత నిబద్ధతతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటూ గ్రామస్తులు కలిసి పనిచేయడం, విద్యా, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఉపాధి వంటి రంగాలపై దృష్టి సారించడం ద్వారా అభివృద్ధి చెందుతుందని లక్ష్యంతో పని చేస్తున్నారు.ఇప్పుడు పడకల్ సర్పంచిగా అవకాశం ఇవ్వాలని డో కూరి ప్రభాకర్ రెడ్డి స్థానిక ప్రజలను కోరడం జరిగింది.




## పెద్దపల్లి జిల్లా ఉమెన్వింగ్ చైర్మెన్ గా ఆముదాల అరుణా




**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీ గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసినటు వంటి బి అండ్ జి హ్యూమన్ రైట్స్ అండ్ లయాంటీ కరప్షన్ అవేర్నెస్ ప్రోగ్రాంలో తెలంగాణ తరపున పెద్దపల్లి జిల్లా బి అండ్ జి హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ చైర్మన్ అలువాల రాజేందర్ అనే ఆధ్వర్యంలో, పెద్దపల్లి జిల్లా ఉమెన్వింగ్ చైర్మన్ ఆముదాల అరుణ,ను పెద్దపెల్లి జిల్లా బి/జి మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ పెద్దపల్లి జిల్లా ఉమెన్ వింగ్ చైర్మన్ గా ఎన్నుకొవడం జరిగినది. నా నియామకానికి సహకరించిన భయపనేని వెంకటేశ్వర్లు ఫౌండర్ అండ్ చైర్మన్ , రావుల తిరుపతయ్య బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ తెలంగాణ, పొదిలి పవన్ కుమార్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, గుంటూరు జిల్లా డిప్యూటీ మేయర్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సాహెద. మరియు దాసరి ఉషాకు కృతజ్ఞతలు తెలిపారు.

## మండలాల్లో స్థానిక సెలవు



**అగ్నిధారన్యూస్** గద్వాల్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగాగ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గద్వాల జిల్లాలో విడతల వారీగా తీసి ఎన్నికలు జరిగే ఆయా మండలాల్లో పోలింగ్ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, పోలింగ్ ముందు రోజు పోలింగ్ రోజు విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే గద్వాల, ధరూర్, గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో పోలింగ్ జరిగే ఈ నెల 11వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. రెండవ విడతలో ఐజ, మల్దకల్, రాజోలి, వడ్డేపల్లి మండలాల్లో పోలింగ్ జరిగే ఈనెల 14న ఆదివారం, ముందు రోజు 13న రెండవ శనివారం సాధారణ సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. మూడవ విడతలో ఎన్నికలు జరిగే ఆలంపూర్, ఇటిక్యాల, ఎర్రవల్లి, ఉండవల్లి మరియు మానవపాడు మండలాల్లో పోలింగ్ రోజు ఈ నెల 17వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, ముందు రోజు 16వ తేదీన అన్ని విద్యాసంస్థలకు సెలవులు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సెలవులను వినియోగించుకొని ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలి

..జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష..

మొదటి విడత పంచాయతీ ఎన్నికల జరిగే మండలాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్.





**అగ్నిధార మంథని//కమాన్ పూర్ డిసెంబర్-10:-** పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మొదటి విడత పోలింగ్ జరిగే మంథని, ముత్తారం, రామగిరి, కమానపూర్, కాల్వ శ్రీరాంపూర్, మండలాల లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మొదటి విడత పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 11 న జరుగుతున్నాయని, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాల్లో చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తూ తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి అలసత్వం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తూ విధులు నిర్వహించ కూడదని, ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని, ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని తెలిపారు. ఎన్నికల విధిని నిర్వహించే సిబ్బందికి గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శు లు, ఎంపిడిఓ లు అవసరమైన తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, ఎలక్ట్రిసిటీ, వాహనాలు ఇతర అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మంథని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏసిపి రమేష్, జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య,సురేష్ ,ఎంపీడీవో లు, ఎం.పి.ఓ.లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు

**భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్ పో లా ఉంది**




**హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదు, భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్ పో లాగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. ఫ్యూచర్ సిటీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకున్నదని అన్నారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే.. గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందని ఎద్దేవా చేశారు. విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదు, దాన్ని చేరుకునే మిషన్ లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్ లో కమిట్మెంట్ లేదు. ఆ డాక్యుమెంట్ కు శాంటిటీ లేదని అన్నారు. అక్షరాలు, అంకెలు, రంగు రంగుల పేజీలతో అర్థం లేకుండా అల్లిన అబద్ధాలు, అర్థ సత్యాల 'విజన్ లెస్' డాక్యుమెంట్ అది అని అన్నారు. రెండేళ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి రేవంత్ రెడ్డి చేసిన పీఆర్ స్టంట్ గ్లోబల్ సమ్మిట్ అని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ అని మూడు నెలల నుంచి ఊదరగొట్టారని.. 18 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తరు అన్నారని.. మంత్రులు పోయి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించారని గుర్తుచేశారు. కనీసం ఒక్క ముఖ్యమంత్రి రాలేదు, 5వేల మంది విదేశీ రిప్రెజంటేటివ్స్ రాలేదు. ఒక్క మీ పార్టనర్ డీకే శివకుమార్ తప్ప అని అన్నారు. చివరకు ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ ఎంపీలు కూడా రాని పరిస్థితి ఉందని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌లో గ్లోబల్ రిప్రెజెంటేటివ్స్ కరువయ్యారని అన్నారు. ఆఖరుకు ఎంబీఏ విద్యార్థులను, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కోట్ వేసి తెచ్చి కూర్చోబెట్టారని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కాదు అది లోకల్ సమ్మిట్.. అట్టర్ ఫ్లాప్ పొలిటికల్ షో ఇది అని విమర్శించారు. ఫార్మా సిటీ భూముల్లో ఫ్యూచర్ సిటీ అని, ఆ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల కోసం గ్లోబల్ సమ్మిట్ అని.. అందమైన కట్టుకథ అల్లినవు రేవంత్ రెడ్డి? బయో స్కోప్ సినిమా చూపించావు.. భూముల స్కాం అయిపోయింది.. పవర్ స్కాం అయిపోయింది.. లిక్కర్ స్కాం అయిపోయింది.. ఇప్పుడు ఇగ రియల్ ఎస్టేట్ స్కాం మొదలు పెట్టిండు అని మండిపడ్డారు. రేవంతు గ్లోబల్ సమ్మిట్ పెట్టింది ఫోర్త్ సిటీ వైపు రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కోసమే కానీ, పెట్టుబడుల కోసం కాదు అని అందరికీ అర్థం అయ్యిందని అన్నారు. ఫార్మా సిటీ పక్క భూములు ముందుగానే మీ బినామీలతో కొనిపించి లే అవుట్లు చేసి రెడీగా పెట్టుకున్నాడని అన్నారు. ఇప్పుడు అక్కడ గ్లోబల్ సమ్మిట్ అని పెట్టి, ఆ భూములను తెగ నమ్మడానికి ప్లాన్ వేశావని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రియల్ ఎస్టేట్ స్కాం కు తెరతీశావని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు తెచ్చింది లేదు, ఉద్యోగాలు ఇచ్చింది లేదు. రెండేళ్లుగా పెట్టుబడుల పేరిట కట్టు కథలు తప్ప చేసింది ఏం లేదని అన్నారు. 2024 జనవరి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల మంత్రి దావోస్ సమావేశానికి వెళ్లారని తెలిపారు. 40,232 కోట్ల పెట్టుబడులు సాధించినం అని, 2,500 ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తయని చెప్పారని గుర్తుచేశారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని నిలదీశారు. ఇదే రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ నెలలో ఏఐ గ్లోబల్ సమ్మిట్ -2024 నిర్వహించిందని గుర్తుచేశారు. 100 దేశాల కంపెనీలు పాల్గొన్నరూ, 20 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నం అని డబ్బా కొట్టారని తెలిపారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని ప్రశ్నించారు. జనవరి 2025 వరల్డ్ ఎకనామిక్ ఫోరం దావాస్ లో జరిగిన సమావేశం సీఎం, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారని తెలిపారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నం అని అక్కడ ఎంతో తిరిగినట్లు, ఎంతో కష్ట పడ్డట్లు సూటు బూటు వేసుకున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెట్టించుకున్నారని పేర్కొన్నారు. అంతా అయిపోయినంక 16 ప్రపంచ అగ్రగామి కంపెనీలతో సుమారు లక్షా డెబ్బై ఎనిమిది వేల కోట్ల (1.78లక్షల కోట్లు) పెట్టుబడుల ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్నదని ఘనంగా ప్రకటించారని.. ఈ ఒప్పందాల ద్వారా 49,550 ఉద్యోగాలు వస్తయి అన్నరని తెలిపారు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని ప్రశ్నించారు. పెట్టుబడులు తెస్తం అని రెండు సార్లు దావోస్ పోయిండు. అమెరికా పోయిండు. సౌత్ కొరియా పోయిండు. ఆస్ట్రేలియా పోయిండు, సింగపూర్ పోయిండు, జపాన్ పోయిండు. ఆ పెట్టుబడులు ఏమయ్యాయి? ఆ ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని హరీశ్‌రావు నిలదీశారు. నిన్న, మొన్న రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్ లో ఏకంగా 5లక్షల కోట్ల పై చిలుకు పెట్టుబడులు, వేల సంఖ్యలో ఉద్యోగాలు అంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాలు విసిరారు. దమ్ముంటే స్వీకరించాలని అన్నారు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి నువ్వు తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి.. శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దావోస్ పెట్టుబడులు, అమెరికా, సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ కంపెనీలు ఎక్కడకు పోయాయి, పెట్టుబడులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ పార్టీని నమ్మినోళ్ల గొంతు కోస్తున్న మంథని ఎమ్మెల్యే

**మంథని :** ఇరువై ముప్పై ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ము కున్న నాయకుల గొంతు కోసిన చరిత్ర మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పుట్ట మధూకర్ మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌కు ప్రజల్లో నమ్మకం విశ్వాసం కోల్పోయినట్లు కన్పిస్తోందని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెప్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ పెద్ద మోసగాడు ఐస్ గడ్డతో చంపేస్తడని చెప్పితే పెడచెవిన పెట్టే ఈ సమాజం, కాంగ్రెస్ పార్టీలో ఉన్నటువంటి నాయ కులు కార్యకర్తలు అర్థం చేసుకుంటలేరని ఆయన అన్నారు. ఇందుకు ఈసారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికే నిలువెత్తు నిదర్శన్నామన్నారు. మూడోసారి మంత్రిగా 40ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్న కుటుంబం వాళ్లు పెట్టిన క్యాండేట్లు గెలుస్తలేరని నిర్ణయం అయి నమ్మినోళ్ల గోంతులు కోశాడని ఆయన అన్నారు. మంత్రి అయిన తర్వాత మొదటిసారి మంథనిలో నిర్వహించిన ర్యాలీలో గొప్ప గొప్ప శ్లోకాలు చదివాడని, ఈసారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో తాము చెప్పిన వారు మాత్రమే ఊరికి ఒక్కరే కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఉంటారని, గతంలో ఊరికి ఇద్దరు ముగ్గురు నిలబడితే బీఆర్ఎస్ వాళ్లు గెలిచారని, అలాంటి పరిస్థితి ఇప్పుడు ఉండదని నమ్మించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాట తప్పాడని ఆయన ఎద్దేవా చేశారు. అయితే ఈసారి ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కోల్పోయామని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ 30ఏండ్లుగా పార్టీ జెండా మోసిన నాయకులను పక్కకు పెట్టి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కండువా కప్పి ఏకగ్రీవం చేశాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను కాంప్రమైజ్ చేసి మా పార్టీ మెంబర్ షిప్ ఉన్నవాళ్లకు అవకాశం కల్పించడంలో మంథని ఎమ్మెల్యే నీతిని ఆ పార్టీ నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. మైదుపల్లిలో పంతంగి లక్ష్మన్, చందనాపూర్‌లో కొండ శ్రీను, మహాదేవ్‌పూర్‌లో జువ్వాజి తిరుపతిలకు కండువా కప్పి కాంగ్రెస్ నాయకులను మోసం చేశాడన్నారు. చందనాపూర్‌లో బాబుమియా అనే నాయకులు అనేక ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ వేరే పార్టీ నాయకులతో కనీసం మాట్లాడడని, అలాంటి నాయకుడిని మోసం చేశాడని వాపోయారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యే ఎలా మోసం చేస్తాడో గమనించా లన్నారు. మహదేవ్‌పూర్‌లో మొన్న రాత్రి గుడాల అరుణ అని ప్రకటించి మళ్లీ మరుసటి రోజున హసీనాబాను అని ప్రకటించారని, ఇలాంటి మోసా లపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపవాసం ఉండి సద్దులు తెచ్చుకుని ఆ కుటుంబం కోసం పని చేసిన వాళ్ల గొంతు కోస్తున్నారని, దుద్దిళ్ల శ్రీధర్‌ను గొప్పగా అనే మూరు&ఢలు ఇప్పటికైనా ఆలోచన చేయాలని హితవు పలికారు. అలాగే గాజులపల్లి, ఎగ్లాస్‌పూర్‌లాంటి అనేక గ్రామాల్లో ఇద్దరు ముగ్గురిని బరిలో నిలిపారని, పార్టీ రూల్స్ దాటితే చర్యలు అని ప్రకటన చేసిన మంత్రి ఇప్పటి వరకు ఎవరినైనా సస్పెండ్ చేశారా అని ప్రశ్నించారు.

## క్రిస్మస్ వేడుకల్లో మానవతా పరిమళం

**పేద వితంతువులకు బట్టలు పంపిణీ.**




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,డిసెంబర్10:(ప్రెస్ క్లబ్ న్యూస్)** క్రిస్మస్ పండుగ సందర్భంగా పెద్దపల్లిలోని కల్వరి ప్రత్యక్షత ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మానవతా దృక్పథంతో కూడిన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ ఉత్సవంలో ముఖ్యంగా నిరుపేద వితంతువులకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాస్టర్ బొంకూరి షేడ్రక్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు, నిస్సహాయులకు సాయం చేయడమే క్రీస్తు ప్రేమను ఆచరణలో పెట్టడం అన్నారు. శ్యామ్ సిస్టర్ రహేల ఈ సేవలో పాల్గొనడం తమకు దేవుడిచ్చిన గొప్ప బహుమతి అని తెలిపారు. సంఘ సభ్యులు ఈ పంపిణీ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, పేద వితంతువులకు బట్టలు అందజేయడంలో కీలక పాత్ర పోషించారని, మతపరమైన ఉత్సవాన్ని సేవా కార్యక్రమంతో కలిపి నిర్వహించినందుకు స్థానికులు మందిరాన్ని, పాస్టర్ షేడ్రక్, సిస్టర్ రహేలను అభినందించారు.

## డీఆర్సీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**నల్లగొండ :** జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం నాడు ఎన్నికల డీఆర్సీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ చేసారు. గట్టుప్పల్ మండల డీఆర్సీ సెంటర్లో ఉదయమే పరిశీలన చేసారు. మొదటి విడత ఎన్నికలు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల సామాగ్రి పంపిణీలో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టాట్యూటరీ/నాన్ స్టాట్యూటరీ పేపర్లు, ఇంకు, మెటీరియల్ తనిఖీ చేసారు. పి-ఓ డైరీని కచ్చితంగా నింపాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్, ఓటర్ జాబితాపై మార్గదర్శకాలు ఇచ్చారు. టీ-పోల్ అప్లోడ్స్ సమయానికి చేయాలని ఆదేశం ఇచ్చారు. పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతకు పోలీసులతో సమన్వయం చేసుకోవాలి. సమస్యలు వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## కండక్టర్ పై దాడి

**జయశంకర్ భూపాలపల్లి** జిల్లా కేంద్రంలోఆర్టీసీ బస్సులో కండక్టర్ పై ప్రయాణికులు దాడి చేసారు. భూపాలపల్లి నుండి హనుమకొండ కు బయలుదేరిన ఎక్స్ ప్రెస్ బస్సు అంబేద్కర్ సెంటర్ లో ప్రయాణికుల కోసం ఆగింది. ఈ నేపథ్యంలో ఫుట్ బోర్డులో నిబడవద్దు అని కండక్టర్ అక్షయ్ ప్రయాణికులకు తెలపడంతో కండక్టర్ తో కొంతమంది ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. గొడవ కాస్త పెద్దది కావడంతో కండక్టర్ పై నలుగురు ప్రయాణికులు దాడి చేసార. దాంతో కండక్టర్ కంటి సమీపంలో స్వల్ప గాయం అయింది. వెంటనే బస్సు డ్రైవర్ ఆర్టీసీ బస్సును ప్రయాణికులతో పోలీస్ స్టేషన్ కు తరలించి దాడి చేసిన వ్యక్తుల పై ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త దారుణ హత్య

**సూర్యాపేట :** నూతనకల్ (మం) లింగంపల్లిలో దారుణ హత్య జరిగింది. సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకుల ముప్పేట దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై విచక్షణారహితంగా దాడి చేసారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దాడిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ తోపాటు 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటన నేపథ్యంలో పోలీసులు గ్రామంలో మోహరించారు.

## త్వరలోనే ఉద్యోగాల ప్రకటన ఉంటుంది

**హైదరాబాద్ :** ఆర్ట్స్ కాలేజీ వద్దకి వచ్చిన తొలి సీఎంగా రేవంత్ రికార్డు సాధించారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రేవంత్ రావడం తట్టుకోలేక కొంతమంది డిస్ట్రబ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలు బాగు పడడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదు. తమని గద్దె దించారని ఓయూ విద్యార్థులపై బీఆర్ఎస్ కి ఇంకా అక్కసు ఉంది. త్వరలోనే ఉద్యోగాల ప్రకటన ఉంటుంది. రాజకీయ నాయకుల ఉచ్చులో విద్యార్థులు పడకండని అయన అన్నారు.

## టాస్కా ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయండి.

**జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్.**

**జగిత్యాల :** నేడు డిసెంబర్ 11న హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగే తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ 9వ ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయాలని టాస్కా జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ,గౌరవ అతిథిగా రాష్ట్ర సంక్షేమ మంత్రి ఆడ్లూరి లక్ష్మన్ కుమార్ లు పాల్గొంటారని,విశిష్ట సీనియర్ సిటీజేన్లకు సన్మానాలు, వయోధికుల హక్కుల పరిరక్షణ పై టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా రావు,మాజీ ఎమ్మెల్సీ కోదండ రాం,తదితరుల ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథము, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.హన్మంత రెడ్డి,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, పూసాల అశోక్ రావు,ఎమ్.డీ.యాకూబ్,కట్ట గంగాధర్,నక్క ఇంద్రయ్య,కరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరసన సెగ

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తగలింది. సీఎం వాహనం క్యాంపస్‌లోకి ప్రవేశించగానే విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం సొంతంగా ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోకుండా ముఖ్యమంత్రి తన వాహనంపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఇదిలావుంటే సీఎం ఓయూ సందర్శన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడే బారికేడ్లు ఏర్పాటు చేసి నిరసనకారులను కట్టడి చేశారు

## బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామాగ్రికి కట్టుదిట్టమైన భద్రత

వికారాబాద్ జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల దృష్ట్యా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఈరోజు బొంరాస్‌పేట్ మండలంలోని డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ (ఆఖీఅ) కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో భాగంగా, ఎస్పీ గారు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ మరియు కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డిలతో కలిసి ఎన్నికల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, రూట్ మొబైల్స్ నిర్వహణ, సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి, మరియు కమ్యూనికేషన్ ప్లాన్‌పై చర్చించారు.



## మలయాళంలో దుమ్మురేపుతున్న మమ్ముట్టి ‘కళంకావల్’.. 4 రోజుల్లోనే రూ.50 కోట్ల కలెక్షన్స్

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం ‘కళంకావల్’ కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు. ఈ వీకెండ్ పెద్ద సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద లేకపోవడంతో ఈ చిత్రం మంచి కలెక్షన్లు రాబడుతుందని సమాచారం.




## హీరోగా టాలీవుడ్ కమెడియన్.. హీరోయిన్‌గా ఏకంగా మిస్ యూనివర్స్..!

తన కామెడీ టైమింగ్‌తో తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తోన్న కమెడియన్ సత్య. బ్రహ్మానందం, అలీ తర్వాత టాలీవుడ్‌కు దొరికిన ఆణిముత్యం ఆయనే. ప్రస్తుతం కమెడియన్‌గా ఫుల్ స్వింగ్‌లో ఉన్న సత్య.. ఇప్పుడు ఏకంగా హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. సత్య నటిస్తోన్న తాజా చిత్రం జెట్లీ. ఇటీవలే ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన హీరోయిన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఇవాళ రియా సింగా పుట్టినరోజు కావడంతో విషెస్ చెబుతూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీతోనే రియా టాలీవుడ్‌కు పరిచయమవుతోంది. రియా సింగా మిస్ యూనివర్స్ ఇండియా-2024 టైటిల్ విన్నర్ కావడం విశేషం. కమెడియన్ సత్య సరసన ఏకంగా మిస్ యూనివర్స్ హీరోయిన్‌గా కనిపించడంపై టాలీవుడ్ ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. కాగా.. జైపూర్‌కు చెందిన రియా సింగా గతేడాది మిస్ యూనివర్స్ ఇండియా 2024 టైటిల్‌ను గెలుచుకుంది. అంతేకాకుండా 2024 నవంబర్ 16న మెక్సికోలో జరిగిన మిస్ యూనివర్స్ 2024 పోటీలో ఆమె భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆమె టాప్ 30 సెమీ-ఫైనలిస్టులలో ఒకరిగా నిలిచింది. మిస్ యూనివర్స్ ఇండియా కంటే ముందు.. ఆమె మిస్ టీన్ ఎర్త్ 2023 టైటిల్‌ను కూడా గెలుచుకుంది.

## హిట్ 4 ఎప్పుడు.. కార్తీ ప్రశ్నకు డైరెక్టర్ శైలేష్ కొలను ఏం చెప్పాడంటే..?

తమిళంతోపాటు తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ ఉన్న కోలీవుడ్ స్టార్ యాక్టర్ కార్తీ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం వా వాతియార్ నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఉప్పెన ఫేం కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రమోషనల్ ఈవెంట్‌లో కార్తీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈవెంట్‌కు వచ్చిన హిట్ ఫ్రాంచైజీ డైరెక్టర్ శైలేష్ కొలనును హిట్ 4 ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందని అడిగాడు కార్తీ. దీనికి శైలేష్ కొలను (నవ్వుతూ) స్పందిస్తూ.. నేను ఇంకా స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నా. కథ పూర్తి చేసేందుకు మరికొంత సమయం కావాలన్నాడు.





## ఇండస్ట్రీలో అలాంటి అమ్మాయిలు కూడా ఉన్నారు

### నటి యామిని భాస్కర్



సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ గురించి ఈ మధ్య చాలా మంది బహిరంగంగా మాట్లాడుతున్నారు. పలువురు హీరోయిన్లు తమకు ఎదురైన వేధింపుల గురించి మీడియాతో పంచుకుంటున్నారు. అంతేకాదు అలాంటి వేధింపులు వస్తే..ఎలా డీల్ చేయాలో కూడా సలహాలు ఇస్తూ.. నూతన నటీనటులుకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా నటి యామిని భాస్కర్ కూడా క్యాస్టింగ్ కౌచ్ గురించి స్పందిచింది. ఇండస్ట్రీలోనే కాదు బయట కూడా ఎదవలు ఉంటారని.. ధైర్యంగా ఎదురుతిరిగితేనే కెరీర్‌లో రాణిస్తామని చెబుతోంది. రభస(2014) చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ తెలుగమ్మాయి.. తొలి చిత్రంతో నటిగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత కాటమరాయుడు, నర్తనశాల, భలే మంచి చౌకబేరమ్, కొత్తగా మా ప్రయాణం ఇలా పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్?గా, హీరోయిన్?గా నటిస్తూ వచ్చింది. నర్తనశాల రిలీజ్ తర్వాత సినిమాలకు బ్రేక్ ఇచ్చిన యామిని.. ఇప్పుడు ‘సైక్ సిద్ధార్థ’సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. డిసెంబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్ గురించి మాట్లాడారు. ఇండస్ట్రీలోనే కాదు బయట కూడా కొంతమంది ఎదవలు ఉంటారు. నా కెరీర్ ప్రారంభంలో ఎలాంటి ఇబ్బందులు రాలేదు ఆనీ.. మధ్యలో కొంతమంది తగిలారు. వాళ్లని ఎలా డీల్ చేయాలో అర్థం కాక.. సినిమాలనే వదులుకున్నాను. కొన్నిసార్లు మనల్ని డ్యామినేట్ చేసేవాళ్లు ఉంటారు. మేల్ ఈగో చూపిస్తూ.. అమ్మాయిలను ఇబ్బంది చేస్తుంటారు. అప్పట్లో నాకు కాస్త భయం ఉండేది. వాళ్ల గురించి మాట్లాడలేకపోయా. సైలెంట్‌గా ఉండేదాన్ని. దీంతో అందరూ నాకు యాటిట్యూడ్ అనుకున్నారు. కానీ అలాంటి వాళ్లకు దూరంగా ఉండడం బెటరనీ నేను భావించా. అయితే ఇండస్ట్రీలో అందరూ చెడ్డవాళ్లు అయితే లేరు. కొంతమంది మంచి వాళ్లు కూడా ఉన్నారు. అమ్మాయిలను గౌరవిస్తారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేవాళ్లు చాలా మందే ఉన్నారు. ఇక కేవలం మగవాళ్లు మాత్రమే ఇబ్బంది పెడతారని నేను చెప్పట్లేదు. ఇక్కడ అమ్మాయిలు కూడా అబ్బాయిలతో ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించేవాళ్లు ఉన్నారు. అవసరానికి వాడుకొని వదిలేసే అమ్మాయిలు కూడా ఇండస్ట్రీలో ఉన్నారు. ఈ రంగంలోనే కాదు ఎక్కడైనా ఇలాంటి వాళ్లు ఉంటారు. మన ప్రవర్తనను బట్టి..మనమేంటో తెలుసుకుంటారు’ అని యామిని చెప్పుకొచ్చారు. అలాగే తనకు గ్యాప్ ఎందుకు వచ్చింది? ఆర్ఎక్స్ 100 చాన్స్ ఎందుకు వదులుకోవాల్సి వచ్చింది? తదిరల విషయాలను కూడా సాక్షితో పంచుకుంది. అవి తెలుసుకునేందుకు ఈ వీడియోని చూసేయండి




## అఖండ 2 దెబ్బకి ఇన్ని సినిమాలు వాయిదా పడ్డాయా..

టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష? తాజా చిత్రం ‘అఖండ 2: తాండవం’ రేపటి నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి. ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల%––%సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం ‘మోగ్లీ’ (%వీశీస్త్రశ్రీఱ%) ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన ‘సైక్ సిద్ధార్థ్’ అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది.ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందరరేగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం ‘శివాజీ’ ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య%––%బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో కొద్ది గంటల్లోనే తేలనుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com